ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

మంగళవారం 4 నవంబరు 2025 5



పుష్కరఘాట్‌లో మహిళల కార్తీక దీపారాధన





చేర నీ పాద దీపం..

తూర్పుగోదావరి జిల్లా కడియపులంకలో కార్తీక సోమవారం పర్వదినాన కోటి దీపోత్సవం నిర్వహించారు. శివపార్వతుల శాంతి కల్యాణం, ఆంజనేయస్వామి నక్షత్రపూజలు వైభవోపేతంగా జరిగాయి. వేదమంత్రాల మధ్య శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ఆంజనేయస్వామి ఆలయకమిటీ అధ్యక్షుడు పల్ల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో అఖండ దీపారాధన ప్రారంభించారు. - కడియం



జాంపేట శివయ్య

కాపాడు.. కార్తీక దామోదరా..

పవిత్ర గోదావరి తీరం హరహర మహాదేవ శంభో శంకరా అంటూ దేవదేవుడి నామస్మరణతో మారుమోగింది. కార్తీక మాసం సోమవారం మహాశివుడికి అత్యంత ప్రీతికరమైన రోజు కావడంతో భక్తులు వేకువజాము రెండుగంటల నుంచే కోటిలింగాల రేవు, చింతాలమ్మఘాట్, పుష్కరాల రేవు, సరస్వతి ఘాట్, గౌతమి ఘాట్లలో కార్తీక స్నానమాచరించి దీపాలు నదిలో వదిలారు. కాపాడు కార్తీక దామోదరా అంటూ వేడుకున్నారు. - రాజమహేంద్రవరం సిటీ



పుష్కరఘాట్‌లో భక్తజనం





అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

అర్జీలపై అలసత్వం వద్దు

- కలెక్టర్ మహేష్‌కుమార్
- పీజీఆర్ఎస్‌కు 270 అర్జీలు

అమలాపురం టౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): అర్జీల పరిష్కారంలో అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సోమవారం జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, ఎస్పీ రాహుల్‌మీనా, జిల్లా రెవెన్యూ అధికారి కె.మాధవి, డీపీవో జి.శాంతలక్ష్మి, డీఎల్డీవోలు రాజేశ్వరరావు, వేణుగోపాల్ కలెక్టర్‌తో కలిసి అర్జీలు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చినవారు 270 అర్జీలను అందించినట్టు కలెక్టర్ తెలిపారు. మార్గదర్శకాలు పాటించడంలో ప్రవర్తనా పరంగా కొందరు అధికారుల్లో కోపాలు కనిపిస్తున్నాయని, వాటిని సరిదిద్దుకోవాలన్నారు. లేకపోతే కఠినచర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ప్రతిష్టాత్మక ంగా నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్‌కు గైర్హాజరయ్యే అధికారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు సూచించారు. అధికారులు వారిశాఖలకు సంబంధించిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలన చేసి నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపించేలా సిబ్బందికి సూచనలు చేయాలన్నారు. కార్యక్రమంలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకుడు కె.ప్రభాకర్, జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్‌షేక్ సలీంబాషా, జిల్లా పౌరసరఫరాల అధికారి ఉదయభాస్కర్ ఉన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ రాహుల్ మీనా

ఎస్పీకి 40 అర్జీలు

అమలాపురం టౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఎస్పీ రాహుల్‌మీనా, అదనపు ఎస్పీ పీవీఆర్‌పీబీ ప్రసాద్ వేర్వేరుగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి 40 అర్జీలు స్వీకరించారు. రాతపూర్వకంగా ఫిర్యాదులు స్వీకరించడంతో పాటు వారి సమస్యలు ముఖాముఖి అడిగి తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి చట్టపరిధిలో అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఎస్పీ సూచించారు. ఆయా ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను నిర్ణీత గడువులోగా జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదిక రూపంలో ఉంచాలని ఆదేశించారు. కుటుంబకలహాలు, భూ వివాదాలు తదితర సమస్యలపై 40 అర్జీలు స్వీకరించినట్టు తెలిపారు.

అక్రమంగా సాగినా : నాడు పోలవరం కాలువ గట్టు వద్ద మట్టి తరలింపు(ఫైల్)





మట్టి పెట్టేశారు!

అనుమతుల్లేకుండా మింగుడు..

కొండలు కరిగాయ్



(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ఒకటి కాదు రెండు కాదు కాదు..ఏకంగా రూ.350 కోట్లు.. గత ప్రభుత్వ హయాంలో ఉమ్మడి జిల్లాలో కొందరు వైసీపీ నేతలు కొల్లగొట్టేసిన పోలవరం మట్టి విలువ ఇది. అధికారం అండతో అనుమతుల్లేకుండా రియల్ ఎస్టేట్, ఇళ్ల స్థలాల చదునుకు అడ్డగోలుగా విక్రయించి సంపాదించింది అంతకుమించే. ఈ మట్టిని బొక్కేసిన అక్రమార్కులపై ఇప్పటికీ కనీస చర్యలు లేకపోవడం విస్మయపరుస్తోంది. ప్రభుత్వం మారిన వెంటనే దీనిపై విచారణ జరుగు తుందని భావిస్తే ఇంతవరకు ఆ ఊసే లేదు. ఒకరకంగా చెప్పాలంటే అప్పటి మట్టి అక్రమా లను మట్టుపెట్టేశారనే ఆరోపణలు వ్యక్త మవు తు న్నాయి. తాజాగా ఉమ్మడి పశ్చిమ, కృష్ణా జిల్లాల్లో వైసీపీ హయాంలో పోలవరం మట్టి అక్రమ తవ్వకాలు రూ.300 కోట్లు అని నిర్దారణ అయిన నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో చోటు చేసుకున్న రూ.350 కోట్ల అక్రమ తవ్వకాల సంగతేంటనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల పరిధిలో పోలవరం ఎడమ ప్రధాన కాలువ వందల కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. సీతానగరం మండలం పురుషోత్తపట్నం దగ్గర మొదలయ్యే ఈ కాలువ గోకవరం, కోరుకొండ, రాజానగరం, గండేపల్లి, ప్రత్తిపాడు, జగ్గంపేట, గొల్లప్రోలు, శంఖవరం, తొండంగి, తుని మండలాల మీదుగా పయనిస్తోంది. గత టీడీపీ ప్రభుత్వంలో ఈ కాలువను 18 మీటర్ల లోతు వరకు తవ్వారు. దీంతో దాదాపు నాలుగు కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టి వచ్చింది. కాలువ వెంబడి భూముల్లో 15 అడుగుల ఎత్తు వరకు మట్టి మేటలు వేశారు.2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక క్రమేపీ ఆ మట్టి కొండలు కరిగిపోతూ వచ్చాయి. అప్పటి అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఇతర నేతలు ఈ మట్టిపై వాలిపోయారు. ప్రధానంగా రాజానగరం, ప్రత్తిపాడు, పిఠాపురం, తుని నియోజకవర్గాల పరిధిలో పోలవరం మట్టిని వైసీపీ ఐదేళ్లలో వేలాది టిప్పర్లలో తరలించేశారు. టిప్పర్ మట్టిని రూ.8 వేలకు కాకినాడ, రూ.12 వేలకు తాళ్లరేవు, యానాం, రూ.4 వేలకు పిఠాపురం, రూ.15 వేలకు కోనసీమలో అనేక రియల్‌ఎస్టేట్ స్థలాల చదునుకు విక్రయించి కోట్లు గడించేశారు. ప్రత్తిపాడు,పిఠాపురం నియోజకవర్గాల పరిధిలో చెందుర్తి జాతీయరహదారి పక్కనే పోలవరం కాలువ వెంబడి కోటిన్నర లక్షల క్యూబిక్‌మీటర్ల మట్టి మేటలు,తునిలో 70 లక్షలకుపైగా క్యూబిక్‌మీటర్ల మట్టి నిల్వలను కాజేశారు. దీనంతటిని అప్పట్లో ముగ్గురు ఎమ్మెల్యేలు తమ అనుచరుల ద్వారా యథేచ్ఛగా తరలించుకుపోయారు.

నిబంధనల ప్రకారం పోలవరం కాలువ మట్టిని తవ్వాలంటే జలవనరులశాఖ అనుమతి తీసుకోవాలి. కానీ గత వైసీపీ ప్రభుత్వంలో అనుమతుల్లేకుండానే మట్టి కొండలు కొల్లగొట్టారు.గనులు, జలవనరులశాఖ అధికారులు కమీషన్లు పుచ్చుకుని కళ్లు మూసుకోవడంతో పోలవరం మట్టి 95 శాతానికి పైగా మాయమైపోయింది. ఒక ప్పుడు భారీ మేటలున్న ప్రాంతాల్లో ఇప్పుడు ఖాళీ స్థలాలు కనిపిస్తున్నాయి. తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాల్లో ఆరున్నర కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టి మాయమైపోయింది. పిఠాపురం నియోజకవర్గం యు.కొత్తపల్లి మండలం కొమరగిరిలో 350 ఎకరాల్లో అప్పటి సీఎం జగన్ చేతుల మీదుగా 2021 డిసెంబర్ 25న పేదలకు ఇళ్లస్థలాలు పంచారు. ఈ భూములు సముద్రానికి అతిసమీపంలో లోతట్టులో ఉన్నాయి. ఈ లేఅవుట్‌ను లక్షల క్యూబిక్ మీటర్ల మట్టితో చదును చేశారు. ఇందుకోసం గొల్లప్రోలు మండలం చెందుర్తి జాతీయరహదారిని ఆనుకుని ఉన్న పోలవరం కాలువ మట్టిని అప్పటి కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి వేలాది టిప్పర్లలో తరలించి కోట్లలో మెక్కేశారు. అప్పట్లో కాకినాడ కీలకనేత ఒక్కరే పోలవరం మట్టిలో రూ.6 కోట్ల వరకు మింగేశారు.

- ఉమ్మడి జిల్లాలో పోలవరం మట్టిని మింగేశారు
- రూ.350 కోట్లకుపైగా మట్టి మాయం
- కోట్లు వెనకేసుకున్న వైసీపీ నేతలు
- ప్రభుత్వం మారి ఏడాదిన్నర
- అక్రమార్కులపై ఇంత వరకూ చర్యల్లేవ్
- తాజాగా రూ.300 కోట్లు మట్టి దోపిడీ
- పశ్చిమ,కృష్ణా జిల్లాల్లో అధికారుల నిర్ధారణ

ఎందుకిలా..

ప్రభుత్వం మారి దాదాపు ఏడాదిన్నరవుతోంది. కానీ ఇంతవరకు పోలవరం మట్టి అక్రమాలపై ప్రభుత్వం కనీసం దృష్టిసారించలేదు. రూ.350 కోట్లకుపైగా విలువైన మట్టిని అప్పటి నేతలు అక్రమంగా అమ్మేసుకున్నా ఇంత వరకు విచారణ చేపట్టకపోవడంతో అక్రమార్కులు దర్జాగా ఉన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరిలో పోలవరం మట్టిని వేలం వేస్తే రూ.350 కోట్ల వరకు రాబట్టవచ్చని 2019లో అధికారులు లెక్కగట్టారు. కానీ అప్పటి ప్రభుత్వం ఈ మట్టంతా తమ పార్టీ నేతలకు దోచిపెట్టింది. పైగా ఈ దోపిడీపై అప్పట్లో ప్రతిపక్ష హోదాలో టీడీపీ పోరాటం చేసింది. ఇప్పుడు చేతిలో అధికారం ఉన్నా కనీసం మట్టి అక్రమాలపై విచారణకు ఆదేశించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

మట్టిలో కలిపేశారా?

కాకినాడ నగరంలో గత వైసీపీ హయాంలో రూ.450 కోట్లకుపైగా విలువైన టీడీఆర్ బాండ్ల జారీపై విజిలెన్స్ నివేదిక సిద్ధమైంది. రేషన్ బియ్యం కుంభకోణంపై సిట్, ఆడుదాం ఆంధ్రా అవినీతిపై విజిలెన్స్ విచారణ చేపట్టింది. పోలవరం మట్టి అక్రమాలపై ఏ విచారణ లేదు. ఉమ్మడి పశ్చిమ, కృష్ణా జిల్లాల్లో 1.21 కోట్ల క్యూబిక్ మీటర్లు రూ.300 కోట్ల విలువైన పోలవరం మట్టి దోపిడీకి గురైందని తాజాగా అక్కడ జలవనరుల శాఖ అధికారులు నిర్ధారించారు. కానీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రూ.350 కోట్లకుపైగా విలువైన మట్టిని మింగేసిన అక్రమార్కులపై కనీసం అధికారులు కూడా ఉలకడం లేదు. దీంతో పోలవరం మట్టి అక్రమాలను మట్టుపెట్టేశారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సూపర్ GST మాయ!



అంతంతమాత్రంగా సూపర్ జీఎస్టీ అమలు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ నుంచి సామాన్యులకు భారీ ఉపశమనం కలిగించి నెల దాటింది. ఇప్పటికీ సూపర్ జీఎస్టీ ఫలాలు సామాన్యుడికి దక్కడం లేదు. ప్రభుత్వాల ఆదేశాలతో యంత్రాంగం ఓ వారం హడావుడి చేసి చతికిలబడింది. మొన్నటి వరకూ పండుగ ఆఫర్లు అంటూ ఊదరగొట్టిన వ్యాపారులు.. ఇప్పుడు ప్రత్యేక తగ్గింపు అంటూ యథావిధిగా మోసపు ఉదారత చాటుకుంటున్నారు. మరి తగ్గిన జీఎస్టీ ఎంత? అసలు అంతకు ముందు ధర ఎంత? కేంద్ర ప్రభుత్వం తమకు కల్పించిన మేలుతో లాభం ఎంత సమకూరింది? అనే ప్రశ్నలకు సమాధానం ప్రశ్నగానే ఉండి పోతోంది. వ్యాపారులు మాత్రం తమ చాకచక్యాన్ని ప్రజలపై రుద్దుతూనే ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం మాత్రం గతంలో ఉన్న ఐదు స్లాబులను రెండుకు తీసుకొచ్చాం..జనానికి భారీగా ఒనగూరుతుందని చెప్పింది. ఈ ధరల మోళీ జీఎస్టీ సూపరట! సేవింగ్స్ ఎక్కడట? అనే సందేహాన్ని నివృత్తి చేయలేక పోతోంది.ఈ గందరగోళం నడుమ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రోజుకు జనం కోట్లాది రూపాయలు నష్టపోతూనే ఉన్నారు.

- కానరాని జీఎస్టీ తగ్గింపు
- పాత ధరలకే అమ్మకాలు
- పాత స్టాకు పేరిట దోపిడీ
- మోసపోతున్న కొనుగోలుదారు
- అధికారుల చర్యలు శూన్యం
- ఆన్‌లైన్‌లోనూ అయోమయం

వ్యాపారుల మాయాజాలం..



జీఎస్టీ తగ్గక ముందు ఎంత ధర, తర్వాత ఏ మేరకు తగ్గిందనే విషయాలు దుకాణాల్లో ఎక్కడా కనబడడం లేదు. ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలలో అయితే అంతా అయోమయమే నడుస్తోంది. అసలు ధరను అమాంతం పెంచేసి భారీ తగ్గింపును చూపిస్తుంటారు. ఇప్పుడు కూడా ఆ మాదిరిగానే ధరలు ఉండడంతో జీఎస్టీ వల్ల తమకు ఏమి ఒరిగిందో వినియోగదారుడికి బోధ పడడం లేదు. మొన్నటి వరకూ పండుగ ఆఫర్ల పేరుతో అంతా కలగాపులగం చేసే శారు. జీఎస్టీ తగ్గింపు ఎంత, వ్యాపారి ఇస్తున్న ఆఫర్ ఎంత? అనే వాటిపై స్పష్టత లేకుండాపోయింది. జీఎస్టీని కేంద్ర ప్రభుత్వం భారీగా తగ్గించింది. గతంలో ఐదు స్లాబులుగా ఉన్న పన్నులను 5, 12% రెండు స్లాబులకు తెచ్చింది. దీనిలో కారుల నుంచి బిస్కట్ల వరకూ దాదాపు 375 వస్తువులపై 5 నుంచి 10 శాతం వరకూ పన్నుపోటు తగ్గింది. కొన్నిటికి పన్ను సున్నా చేశారు. అయితే ఆ మేరకు వినియో గదారుడికి ఎంత లబ్ధి చేకూరిందో సూపర్ జీఎస్టీ అమల్లోకి వచ్చి నెల దాటినా స్పష్టత కొరవడింది. ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలలో మరీ దారుణంగా పరిస్థితి నడుస్తోంది. వాస్తవ ధర నిర్ధారణలో స్పష్టత లేకపో వడంతో రూ.5 విలువ చేసే పెన్‌ని రూ.5 వేల ధర చూపించి 99 శాతం డిస్కౌంట్ ఇచ్చేస్తున్నామని రూ.50 ధర పెడుతున్నారు. దీని వల్ల ఇప్పుడు జీఎస్టీ ఎంత తగ్గించారో కూడా తెలియడం లేదు.

మందుల్లో మోళీ..

ఇవాళ మందుల ఖర్చు చూసి రోగం మరింత ముదిరి పోతోంది. ఓ వైపు అధిక శాతం డాక్టర్లు మందులతో చీటీలను పూర్తిగా నింపేస్తుంటే.. మరోవైపు మందుల దుకాణాల వాళ్లు ఎడాపెడా దోచేస్తున్నారు. చాలా ఆస్పత్రుల్లో సొంత మెడికల్ షాపులు అదనపు వ్యాపారంగా మారిపోయింది. బయట షాపుల్లో ఎమ్మార్పీపై ఏకంగా 20 శాతం వరకూ తగ్గింపు ఇస్తామంటూ వ్యాపారస్తులు పోటీ పడుతుంటారు. ఆస్పత్రుల్లోని మెడికల్ షాపుల్లో ఆ రాయితీ వర్తించడం లేదు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం మందులపై జీఎస్టీని గణనీయంగా తగ్గించింది. అత్యవసర మందులపై పన్ను ఎత్తేసింది. కానీ ప్రజలకు మాత్రం ఆ మేరకు జేబుకు ఆదా కనబడడం లేదు.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 3 వేల వరకూ మందుల షాపులు ఉండగా.. 150 వర కూ పెద్ద దుకాణాలు ఉన్నాయి. అత్య వసర మందులతో పాటు సాధారణ మందులను ఒకే చీటీలో రాస్తారు. దీంతో సందట్లో సడేమియా మాదిరిగా అత్యవసర మందులకు జీఎస్టీ తగ్గింపు ఇవ్వడం లేదు.



అంతా గందరగోళం

దుకాణదారులు జీఎస్టీ మార్పులను అమలు చేయడం లేదు. ఏదో ఒకటి రెండు వస్తువులపై తగ్గింపును చూపుతూ అధిక శాతం వస్తువులపై దోపిడీ సాగుతోంది. కిరాణా తదితర సరుకుల విషయంలో ఇదే నడుస్తోంది. కొందరు వ్యాపారులు పాత స్టాకు, పాత ధరలకే హోల్‌సేల్‌గా కొన్నా మంటూ ధరలు తగ్గించకపోవడం గమనార్హం. సబ్బులు, టూత్‌పేస్ట్, బిస్కట్లు, లేస్, బింగోస్ వంటి వాటి విషయంలో ఎఫ్ఎంసీజీ కంపెనీలు ధరలు తగ్గించలేదు. అయితే వీటి పరిమాణాన్ని పెంచామని చెబుతూ గందరగోళానికి తెరలేపుతున్నాయి. పాలు, ఆహార పదార్థాలు, హోటళ్లు, నిత్యావసరాల్లో వేటిపై జీఎస్టీ ఎంత తగ్గిందో ఇప్పటికీ అయోమయంగానే ఉంది. సెప్టెంబరు 22 నుంచి సూపర్ జీఎస్టీ అమల్లోకి రాగా ఓ వారం రోజులు అధికారులు పరుగులు పెట్టారు. తర్వాత యథావిధిగా పట్టు వదిలేశారు.

జీఎస్టీ తగ్గలేదా.. ఫిర్యాదు చేయండి

జీఎస్టీ అమలుకాని పక్షంలో కొనుగోలుదారుడు ఫిర్యాదు చేసే అవకాశం ఉంది. ఈ విషయం చాలా మందికి తెలియదు. తగ్గిన పన్నుల ప్రకారం ధరలు నిర్ణయించి అమ్మకాలు సాగించకపోతే కొనుగోలుదారుడు నేషనల్ యాంటీ ప్రాఫెటరింగ్ అథారిటీకి ఫిర్యాదు చేయవచ్చు. అయితే ఇలాంటి ఒక సంస్థ ఉందని వందలో ఒక్కరికి కూడా తెలియని పరిస్థితి ఉంది. ఇప్పటికీ దీనిపై యంత్రాంగం అవగాహన కల్పించలేదు. అసలు అధికారుల్లో అధిక శాతం మందికి ఆ సంస్థ గురించి తెలియదు. బిల్లులు ఇవ్వకపోయినా వాణిజ్య పన్నుల శాఖ పట్టించుకున్న దాఖలాలు లేవనే చెప్పవచ్చు. అటు ఔషధ నియంత్రణ శాఖ అసలు ఉందా? అనే తీరు కనబరుస్తోంది.

విపత్తులను ఎదుర్కొనేందుకు సిద్ధం

కలెక్టర్ మహేష్‌కుమార్

తుఫాన్ నేపథ్యంలో ఉత్తమ సేవలకు గుర్తింపుగా

185 మంది ప్రభుత్వ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు



కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న డివిజనల్ పీఆర్వో వెంకట్రామిరెడ్డి

అమలాపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తీర ప్రాంతంలో విపత్తులను ఎదుర్కొనేందుకు గత అనుభవాలను జోడించి మరింత సంసిద్ధతతో ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాలకు ఆస్కారం లేకుండా ఉద్యోగులు కార్యచరణతో సిద్ధం కావాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులతో సమావేశం నిర్వహించి విపత్తులను ఎదుర్కొవడంలో సిబ్బంది అభిప్రాయాలను, మెరుగైన విధానాలు, అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ మొంథా తుఫాన్ నేపథ్యంలో అంకిత భావంతో కలిగిన సేవలు ప్రశంసనీయమన్నారు. ఉత్తమ సేవలకు గుర్తింపుగా జిల్లాలో వివిధ కేడర్లకు చెందిన 185 మంది ప్రభుత్వ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. వారి నుంచి తుఫాన్ సహాయక చర్యల అనుభవాన్ని అడిగి తెలుసుకున్నారు. తీర ప్రాంతంలో గ్రీన్ బెల్టు మడ అడవుల పెంపకానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జేసీ టి.నిషాంతి, జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, డీఆర్వో కె.మాధవి, ఆర్డీవోలు శ్రీకర్, అఖిల పాల్గొన్నారు.

నెలకు 120 ప్రసవాలేనా...!

ప్రాంతీయ ఆసుపత్రుల పనితీరుపై కలెక్టర్ అసంతృప్తి

అమలాపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాంతీయ ప్రభుత్వ ఆసుపత్రి నిర్వహణ తీరు పట్ల తీవ్రమైన ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో వైద్య సేవలను బలోపేతం చేయాలని, లేకపోతే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని కలెక్టర్ మహేష్‌కుమార్ హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లో వైద్యాధికారులు, వైద్యసేవల మౌలిక విభాగం ఇంజనీర్లతో ప్రాంతీయ ఆసుపత్రి మౌలిక వసతులు, వైద్యసేవల సరళిపై కలెక్టర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. అమలాపురంలో ఉన్న ప్రాంతీయ ఆసుపత్రుల్లో నెలకు 120 ప్రసవాలు మాత్రమే నిర్వహించడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నెలకు 1500 ప్రసవాలు నిర్వహించేలా ప్రసూతి వైద్యసేవల విభాగం, గర్భిణుల పథకాల సంఖ్య, మాతా శిశు సంరక్షణ బ్లాక్‌లను మరింత బలోపేతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ కొత్త సంచార ఐసీటీసీ వాహనాన్ని జెండా ఊపి ఆయన ప్రారంభించారు.

తత్ప్రణమామి
సదాశివలింగం



కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ పుష్కరిణిలో కార్తీక దీపం వెలిగించిన భక్తురాలు



కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడలో ప్రత్యేక అలంకారంలో రామలింగేశ్వరస్వామి



ద్రాక్షారామంలో భీమేశ్వరస్వామికి పంచామృతాభిషేకం



తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం పుష్కర ఘాట్‌లో దీప ప్రజ్వలన చేస్తున్న మహిళ

కార్తీక మాసం రెండో సోమవారం శైవ క్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. హరహర మహాదేవ, శంభోశంకర... పాహిమాం, రక్షమాం అంటూ శివనామ స్మరణ చేశారు. తెల్లవారుజామునే ఆలయాలకు వెళ్లి క్యూలైన్లలో బారులు తీరి శివుడిని దర్శించుకుని అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. రాజమహేంద్రవరం పుష్కరాల రేవులో అధిక సంఖ్యలో భక్తులు పుణ్యస్నానాలు ఆరించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ప్రముఖ క్షేత్రాలైన పిఠాపురం పాదగయలో కుక్కుటేశ్వరస్వామికి, సామర్లకోట, ద్రాక్షారామల్లో భీమేశ్వరస్వామికి, మురమళ్లలో వీరేశ్వరస్వామికి, కోటిపల్లిలో సోమేశ్వరస్వామికి అర్చకులు పంచామృతాభిషేకాలు, విశేష అర్చనలు జరిపారు.



కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రంలో కుక్కుటేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు విక్రమభట్టేశ్వరస్వామి ఆలయంలో శివలింగానికి అభిషేకం



కాకినాడ జిల్లా సామర్లకోటలో కుమారరామ భీమేశ్వరస్వామికి క్షీరాభిషేకం



కాకినాడ జిల్లా గొల్లప్రోలులో బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 25 అడుగుల శివలింగం



కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లిలో అరుణాచలేశ్వరస్వామికి పంచహారతి ఇస్తున్న దృశ్యం

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★


కథే ఈ సినిమాకు హీరో



దేవన్


దేవన్ కథానాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వం వహించిన సినిమా 'కృష్ణ లీల'. 'తిరిగొచ్చిన కాలం' అనేది ఉపశీర్షిక. ధన్య బాలకృష్ణన్ హీరోయిన్. జ్యోత్స్న జి నిర్మిస్తున్నారు. ఈ నెల 7న సినిమా విడుదలవుతున్న సందర్భంగా దేవన్ మీడియాతో ముచ్చటించారు. 'ఇదో సూపర్ నేచురల్ లవ్‌స్టోరీ. కొత్తదనంతో నిండిన ఈ కథను నిర్మాతలకు వినిపించగానే ఓకే చేశారు. కృష్ణుడు ఒక ప్రేమ కథలో తన లీలలు ఎలా చూపిస్తారనేది ఆసక్తికరంగా చూపిస్తున్నాం. మనుషులు ఎలాగూ గడిచిపోయిన కాలాన్ని తిరిగి తీసుకురాలేరు. దైవత్వంతో ఆ కాలాన్ని తిరిగి తీసుకురావడమే చిత్ర కథాంశం. కృష్ణతత్వాన్ని అందరికీ మరింత బాగా అర్థమయ్యేలా ఇందులోని సన్నివేశాలు ఉంటాయి. కథే ఈ సినిమాకు హీరో. ప్రేమలోని గొప్పదనాన్ని అందంగా ఆవిష్కరిస్తుందీ చిత్రం. భీమ్స్ సిసిరోలియో సంగీతం సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లింది. చిత్రం అన్ని వర్గాల వారినీ మెప్పిస్తుందనే నమ్మకం ఉంది' అని చెప్పారు.

నటుడిగా యాభై ఏళ్లు.. 22న భారీ వేడుక!




విలక్షణ నటుడు డాక్టర్ మోహన్‌బాబు నటుడిగా పరిచయమై ఈ ఏడాదికి యాభై ఏళ్లు. ఆయన హీరోగా నటించిన తొలి చిత్రం 'స్వర్గం నరకం' 1975 నవంబరు 22న విడుదల అయింది. ఈ అసాధారణ ప్రయాణాన్ని గౌరవించుకునే క్రమంలో ఈ నెల 22న 'ఎంబీ 50.. ఏ పెర్ల్ నైట్ ట్రిబ్యూట్' అనే పేరుతో ఓ భారీ వేడుకను మంచు విష్ణు నిర్వహించనున్నారు. 'దిగ్గజ నటుడిని, భారతీయ సినిమాకు ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకొనేలా ఈ ఈవెంట్ ఉంటుందని మంచు విష్ణు చెప్పారు. ఎలాంటి సినిమా నేపథ్యం లేకపోయినా ఒంటరిగా సినీ ప్రయాణం మొదలు పెట్టి, తనకంటూ ఓ సామ్రాజ్యాన్ని ఏర్పరచుకుని విలక్షణ నటుడిగా ఎదిగిన మోహన్‌బాబు ఎదిగిన జర్నీ గురించి అందరికీ మరోసారి వివరించి చెప్పనున్నారు. ఈ వేడుక పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని మంచు విష్ణు చెప్పారు.

ఉత్తమ నటుడిగా మమ్ముట్టి రికార్డ్!



సోమవారం ప్రకటించిన కేరళ ఫిల్మ్ అవార్డ్స్‌లో మలయాళ చిత్రరంగ సూపర్‌స్టార్ మమ్ముట్టి ఏడోసారి ఉత్తమ నటుడిగా ఎన్నికై అరుదైన రికార్డ్ నెలకొల్పారు. నటుడు ప్రకాశ్‌రాజ్ అధ్యక్షతన ఏర్పాటైన ఏడుగురు సభ్యులున్న జ్యూరీ కమిటీ అవార్డులను ఎంపిక చేసింది. త్రిస్సూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో కేరళ మంత్రి షాజీ చెరియన్ అవార్డుల వివరాలు వెల్లడించారు. 'భ్రమరయుగం' చిత్రంలో నటించిన మమ్ముట్టి ఉత్తమ నటుడిగా ఎన్నికయ్యారు. ఉత్తమ చిత్రంగా 'మంజుమ్మల్ బాయిస్' ఎన్నికైంది. ఉత్తమ దర్శకుడు అవార్డ్ సహా మొత్తం ఎనిమిది అవార్డులతో ఈ సినిమా సత్తా చాటింది. ఉత్తమ నటుడిగా తను మరోసారి ఎన్నిక కావడంపై మమ్ముట్టి వ్యాఖ్యానిస్తూ 'ఇదో ప్రయాణం.. రకరకాల వ్యక్తులతో కలసి చేసే సుదీర్ఘ ప్రయాణం. ఇక్కడ పోటీ అనే పదానికి తావు లేదు' అని అన్నారు.

రాకెట్‌కు బాహుబలి పేరు - రాజమౌళి హర్షం



భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) ఇటీవలే ఎల్‌వీఎం3-ఎం5 రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించిన విషయం తెలిసిందే. ఈ రాకెట్‌కు దాని బరువు, సామర్థ్యానికి తగ్గట్టుగా 'బాహుబలి' అనే పేరు పెట్టడంపై దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి హర్షం వ్యక్తం చేశారు. 'దేశానికి గర్వకారణమైన క్షణం ఇది. మా సినిమా టైటిల్‌తో ఉన్న రాకెట్ ఇంత గొప్ప విజయాన్ని సాధించడం మాకు చాలా ఆనందాన్నిచ్చింది' అని ఇస్రో శాస్త్రవేత్తలను రాజమౌళి అభినందించారు.

సినిమా టిక్కెట్‌ల వివాదంపై సుప్రీం స్టే

మల్టీప్లెక్స్‌లలోని సినిమా టిక్కెట్‌లకు ఆడిట్ చేసే విధంగా రికార్డులను నిర్వహించాలని కర్ణాటక హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు స్టే విధించింది. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఏకరూప టిక్కెట్ విధానాన్ని (రూ.200 + జీఎస్టీ) ప్రశ్నిస్తూ హోంబలె ఫిల్మ్స్, మల్టీప్లెక్స్‌ల సంఘం హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. దీనిపై హైకోర్టు సింగిల్ జడ్జి మధ్యంతర స్టే ఇచ్చారు. ఈ ఉత్తర్వులకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు డివిజన్ బెంచ్ విచారించింది. సెప్టెంబరు 30న 'ఆడిట్ చేసే విధంగా రికార్డులను నిర్వహించాలి' అని ఆదేశాలు జారీ చేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం విచారించింది. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం టిక్కెట్ ధరలపై అసంతృప్తిని వ్యక్తం చేసింది. మల్టీప్లెక్స్‌లలో వాటర్ బాటిల్‌కు రూ.100 వసూలు చేస్తున్నారని, ఇప్పటికే థియేటర్లకు వచ్చే వారి సంఖ్య తగ్గుతోందనీ, మరింత సహేతుకంగా ధరలను నిర్ణయించాలని, లేకపోతే హాళ్లు ఖాళీగా మారిపోతాయని ధర్మాసనం వ్యాఖ్యానించింది. బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

మన జీవితాలకు వర్తించేలా ఉంటుంది



దీక్షిత్ శెట్టి

'దసరా', 'దియా' చిత్రాలతో తెలుగులో మంచి గుర్తింపు తెచ్చుకున్న దీక్షిత్ శెట్టి నటించిన తాజా చిత్రం 'ద గర్ల్‌ఫ్రెండ్'. రష్మిక కథానాయికగా రాహుల్ రవీంద్రన్ తెరకెక్కించారు. గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్టైన్‌మెంట్స్ బేనర్లపై ధీరజ్ మొగిలినేని, విద్యా కొప్పినీడి నిర్మించారు. ఈ నెల 7న చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర విశేషాలను మీడియాతో ముచ్చటించారు దీక్షిత్ శెట్టి. 'దసరా' సినిమాలో నేను పోషించిన పాత్ర నచ్చి, 'ది గర్ల్‌ఫ్రెండ్'లో నటిస్తారా అని దర్శకుడు రాహుల్ రవీంద్రన్ అడిగారు. ఆయన చెప్పిన స్క్రిప్ట్ నచ్చి వెంటనే అంగీకరించాను. ఇందులో నా పాత్ర పేరు విక్రమ్. నా పాత్ర తీరుతెన్నులు ఎలా ఉంటాయి అనేది చాలా క్లియర్‌గా వివరించేవారు రాహుల్. నా పాత్రకు కొన్ని నెగెటివ్ షేడ్స్ ఉంటాయి. ఇప్పటిదాకా మనం చూసిన ప్రేమకథలన్నీ ఒక తరహాలోనే సాగుతుంటాయి. ప్రేమకథని మరో కోణంలో ఆవిష్కరించే చిత్రమిది. మనందరి జీవితాలకు వర్తించేలా సినిమా ఉంటుంది' అని తెలిపారు.



PARAS



ప్రముఖ ఆలయాల్లో భక్తుల భద్రత, సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి

అన్నవరం, పిఠాపురం, సామర్లకోట ఆలయాల్లో ఏర్పాట్లపై నిరంతర పర్యవేక్షణ

అధికారులు సమన్వయంతో పనిచేయాలి : డిప్యూటీ సీఎం పవన్ ఆదేశం



పిఠాపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పవిత్రమైన కార్తీక మాసంలో ఆలయాలకు భక్తుల రద్దీ పెరిగిన నేపథ్యంలో ప్రముఖ ఆలయాల్లో భక్తుల భద్రత, సౌకర్యాలపై అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశించారు. క్యూలైన్ల ఏర్పాటు, పారిశుధ్య నిర్వహణ, భద్రతాపరమైన అంశాలపై శ్రద్ధ వహించాలన్నారు. కాకినాడ జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రాలైన పిఠాపురం పాదగయ, సామర్లకోట కుమారరామ భీమేశ్వరస్వామి, అన్నవరం సత్యనారాయణస్వామి ఆలయంతో పాటు ఇతర ముఖ్య ఆలయాల్లో ఏర్పాట్లపై ఆయన సోమవారం కలెక్టర్ సగిలి షాన్‌మోహన్, ఎస్పీ బిందుమాధవ్, జిల్లా అధికారులతో మాట్లాడి పలు అంశాలపై సూచనలు ఇచ్చారు. కాశీబుగ్గ సంఘటన నేపథ్యంలో ఆలయాల వద్ద అటువంటివి జరగకుండా అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. దేవాదాయ శాఖ ఆధీనంలోని దేవాలయాలతో పాటు ప్రైవేటు ఆలయాల్లో ఉన్న పరిస్థితులపై అధికారులు తక్షణం పరిశీలన జరిపి కలెక్టర్, ఎస్పీలకు నివేదిక అందజేయాలని ఆదేశించారు. అన్నిచోట్లా భక్తుల రద్దీ ఏ విధంగా ఉంటుందో పర్యవేక్షణ చేయాలన్నారు. బుధవారం కార్తీక పౌర్ణమి, ఇతర ముఖ్యమైన పర్వదినాలతో పాటు శని, ఆది, సోమవారాల్లో భక్తుల రద్దీ ఊహించని విధంగా ఉంటుందని తెలిపారు. దేవాదాయ, పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా క్యూలైన్ల ఏర్పాట్లు ఉండాలని, సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. తాత్కాలిక టాయిలెట్లు, మరుగుదొడ్ల ఏర్పాటుతో పాటు చెత్తచెదారం పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని, పారిశుధ్య నిర్వహణపై ఆయా మున్సిపాలిటీలు, పంచాయతీలు బాధ్యత తీసుకోవాలని సూచించారు. రద్దీ సమయాల్లో ఆర్టీసీ బస్సులను అధికంగా నడపాలని, ప్రమాదాలు జరగకుండా ట్రాఫిక్ నియంత్రణపై పోలీసు శాఖ దృష్టి సారించాలన్నారు. ఆలయాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. ప్రముఖ క్షేత్రాలతో పాటు అన్ని ఆలయాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని పవన్‌కల్యాణ్ స్పష్టం చేశారు.

అన్నవరం...అప్రమత్తం!

- కాశీబుగ్గ ఘటన నేపథ్యంలో సత్యదేవుడి గిరిప్రదక్షిణపై ప్రభుత్వం దృష్టి
- రెండు లక్షలమంది వస్తారని అంచనా
- అన్నవరం దేవస్థానం అధికారులతో దేవదాయ కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్
- గిరిప్రదక్షిణ జరిగే ప్రాంతమంతా పరిశీలించిన కాకినాడ జిల్లా ఎస్పీ



దేవదాయ కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అన్నవరం దేవస్థానం అధికారులు

అన్నవరం నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి పర్వదినం పురస్కరించుకుని ఈనెల 5న సత్యదేవుడి గిరిప్రదక్షిణ నిర్వహణ, జాగ్రత్తలపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఇటీవల కాశీబుగ్గ ప్రమాద ఘటన నేపథ్యంలో అప్రమత్తతపై అన్నవరం దేవస్థానం అధికారులకు దేవదాయ శాఖ కమిషనర్ సోమవారం ఉదయం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సూచనలిచ్చారు. అలాగే డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాలతో కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ గిరిప్రదక్షిణ జరిగే సుమారు 11 కిలోమీటర్ల దూరాన్ని, భక్తులకు కల్పించే ఏర్పాట్లను సోమవారం సాయంత్రం పరిశీలించారు. దేవదాయ కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ గిరిప్రదక్షిణకు సుమారు 2లక్షల మంది భక్తులు వస్తారని అంచనా ఉందని ఉదయం 8గంటలకు పల్లకీసేవ, మధ్యాహ్నం 2గంటలకు సత్యరథంతో గిరియాత్ర జరుగుతుందన్నారు. ఎక్కడా తోపులాటలకు ఆస్కారం లేకుండా రోప్‌పార్టీ ఉండాలని, 2 సమయాల్లో గిరిప్రదక్షిణ జరుగుతుందని విస్తృత ప్రచారం చేయాలని దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్ సూచించారు. భక్తులు ఎక్కడా వెయిటింగ్ లేకుండా నిరంతరాయంగా నడక కొనసాగేలా చేయాలని, ఒకేచోట భక్తజనం గుమికూడకుండా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు

ఇప్పటికే దేవదాయశాఖ ముగ్గురు ప్రత్యేక అధికారులకు బాధ్యతలు అప్పగించగా గిరిప్రదక్షిణ ఫెస్టివల్ అధికారిగా రీజనల్ జాయింట్ కమిషనర్ వి.త్రినాధరావును నియమించారు. గిరి ప్రదక్షిణ అనంతరం కార్తీకమాసం మిగిలిన పర్వదినాల్లో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయలని సూచించారు. అనంతరం వీడియో కాన్ఫరెన్స్‌లో వెల్లడించిన అంశాలపై ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్ సిబ్బందితో సమావేశంలో వెల్లడించి కమిషనర్ ఆదేశాలకణుగుణంగా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ప్రధానంగా రూ.1500, 2000 వ్రతమండపాల వద్ద వెయిటింగ్ అధికంగా ఉంటుందని పరిస్థితులకు అనుగుణంగా వ్రతం టిక్కెట్ల విక్రయాలు చేపట్టాలని సూచించారు. కార్తీక పౌర్ణమి రోజున సుమారు 15వేల వ్రతాలు జరుగుతాయని అంచనా వేస్తూ ఏర్పాట్లు, సిబ్బంది ఉండాలని తెలిపారు.

పోలీస్‌లు అప్రమత్తంగా ఉండాలి

డిప్యూటీ సీఎం ఆదేశాలతో కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ సోమవారం సాయంత్రం గిరిప్రదక్షిణ జరిగే సుమారు 11 కిలోమీటర్ల దారిని పరిశీలించారు. స్టాల్స్ ఏర్పాటు, మహిళలకు తాత్కాలిక మరుగుదొడ్ల తదితర వివరాలను దేవస్థానం అధికారులు వివరించగా ఆయన పలు సూచనలు చేశారు. పోలీస్ యంత్రాంగం అంతా చాలా అప్రమత్తంగా బాధ్యతతో వ్యవహరించాలన్నారు. నిర్లక్ష్యం ప్రదర్శించకుండా పర్యవేక్షణ జరగాలని డీఎస్పీ, సీఐలకు సూచించారు. కార్తీకమాసం పూర్తయ్యే వరకు భక్తులు అధికంగా వచ్చే పర్వదినాల్లో భద్రతాచర్యలు, గస్తీ ముమ్మరంగా ఉండాలని సూచించారు.



గిరి ప్రదక్షిణ రోడ్డును పరిశీలిస్తున్న కాకినాడ ఎస్పీ, దేవస్థానం అధికారులు

నేడు అంతర్వేదిలో మహాశాంతి హోమం

10వేల మంది భక్తులు వస్తారనే అంచనాతో ఏర్పాట్లు

అంతర్వేది/మలికిపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో రాజోలు నియోజకవర్గ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా శ్రీలక్ష్మీనరసింహస్వామి అభయన్నిచ్చినందుకు నవనారసింహ క్షేత్రాల్లో ఒకటైన అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం ప్రాంగణం ఎదురుగా ఉన్న కల్యాణ షెడ్డులో మంగళవారం మహాశాంతి హోమాన్ని నిర్వహిస్తున్నట్టు ఆలయ సహాయ కమిషనర్ ఎంకేటీఎన్వీ ప్రసాద్ పేర్కొన్నారు. సుమారు పదివేలాది మంది భక్తులు ఈ హోమంలో పాల్గొంటారని, వారికి ప్రత్యేక అఖండ అన్నసమారాధన కూడా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు హోమం జరుగుతుందన్నారు. అలాగే మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురంలో రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ విలేకర్లతో మాట్లాడుతూ భక్తుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా మొంథా పెను తుఫాన్ ప్రభావం నుంచి రాజోలు దీవి ప్రజలను, ఆస్తులను కాపాడిన నరసింహస్వామికి నిర్వహించే మహాశాంతి హోమాన్ని రాజోలు దీవి ప్రజలంతా కలసి విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. 10వేల మంది భక్తులు వస్తారనే అంచనాతో ఏర్పాట్లు చేస్తున్నామని, పూర్ణాహుతి కార్యక్రమం కూడా ఉంటుందన్నారు. భక్తుల కోసం పలు ప్రాంతాల నుంచి బస్సులు ఏర్పాటు చేసినట్టు ఆయన చెప్పారు.

ఇంటి నుంచి వెళ్లిపోయిన బాలిక

తల్లిదండ్రులకు అప్పగింత

ప్రత్తిపాడు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): బాలిక మిస్సింగ్ కేసును 8గంటల్లో ప్రత్తిపాడు పోలీసులు చేధించారు. బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడ జిల్లా ప్రత్తిపాడుకు చెందిన 14 ఏళ్ల బాలిక చదువు విషయంలో తల్లిదండ్రులు మందలించడంతో ఇంట్లోని సుమారు రూ.15లక్షల విలువైన బంగారం, రూ.50వేలు తీసుకుని ఆదివారం మధ్యాహ్నం వెళ్లిపోయింది. దీనిపై తల్లిదండ్రులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ దర్యాప్తు చేపట్టారు. బాలిక ఆచూకీ కనుగొనేందుకు సీఐ బి.సూర్య అప్పారావు పర్యవేక్షణలో పలు బృందాలు గాలింపు చేపట్టాయి. సెల్‌ఫోన్ టెక్నాలజీ సహాయంతో ఎస్ఐ గాలింపు ముమ్మరం చేశారు. భీమవరం ప్రాంతంలో బాలిక ఉన్నట్లు గుర్తించారు. బాలికను బంగారం, నగదుతో సహా సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో పోలీసుల్ని ఉన్నతాధికారులు అభినందించారు.

పుష్కరఘాట్‌లో గుర్తుతెలియని మృతదేహం

అంబాజీపేట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం వాకలగరువు పుష్కర ఘాట్‌లో సుమారు 35 ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. కాళ్లకు షూ ఉన్నట్టు స్థానికులు గుర్తించారు. కుడిచేతికి కనకదుర్గమ్మ బొమ్మతో ఎరుపు తాడు కట్టి ఉంది. ఎస్ఐ చిరంజీవి ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని బయటకు తీయించారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

సుధా ఆశ్రమం

సుధా వృద్ధుల ఆశ్రమం (రీ.నెం:319/2025) బెడ్ రిడ్డెన్ సర్వీస్ మరియు హోం సర్వీస్ కలదు. నర్సింగ్ సేవలు కలవు కాకినాడ సెల్: 7702514515, 8106637056

AJD:

4 Lines CLASSIFIED Rs.230/- Only

అండగా ఉంటాం అధైర్యపడొద్దు

బాధిత బాలిక కుటుంబానికి రూ.5లక్షలు ఎక్స్‌గ్రేషియా : మంత్రి సుభాష్

ఐ.పోలవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అత్యాచారానికి గురైన బాలిక కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు బాలిక తల్లికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం కల్పనకు మంత్రి వాసంశెట్టి సుభాష్‌హామీ ఇచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలంలో బాణాపురంలో బాలిక కుటుంబాన్ని మంత్రి సోమవారం పరామర్శించారు. బాలిక కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని, వైసీపీ మాయమాటలు నమ్మవద్దన్నారు. సంఘటన జరిగిన వెంటనే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, హోంమంత్రి అనిత దృష్టికి తీసుకెళ్లామన్నారు. సీఎం వెంటనే బాధిత కుటుంబాన్ని పరామర్శించి అండగా ఉండాలని ఆదేశించారన్నారు. హోంమంత్రి అనిత వెంటనే ఎస్పీకి ఫోన్ చేసి నిందితుని అరెస్టు చేయాలని ఆదేశించినట్టు తెలిపారు. బాధిత కుటుంబానికి ఇళ్ల స్థలం కేటాయించి, ఇల్లు నిర్మించే ఏర్పాటు చేస్తామన్నారు. పిల్లల చదువు విషయంలో కూడా బాధ్యత తీసుకుంటామన్నారు. ఆ కుటుంబాన్ని ఎంపీ హరీష్‌మాధుర్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ పరామర్శించారు.

ఫోన్‌లో హోంమంత్రి పరామర్శ

బాణాపురంలో అత్యాచారానికి గురైన బాలిక కుటుంబాన్ని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత సోమవారం ఫోన్‌లో పరామర్శించారు. బాలిక తల్లితో మాట్లాడి మనోనిబ్బరంతో ఉండాలని సూచించారు. నిందితుడిని చట్టపరంగా కఠినంగా శిక్షించి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు.

'నిందితులను విడిచిపెట్టం'



కంచిపల్లి శ్రీనివాస్ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న మంత్రి సుభాష్, ఎంపీ హరీష్

అమలాపురం రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మనిషి బతికుండగానే కిరాతకంగా నాలుక కోసి జుట్టు తొలగించడం అత్యంత హేయమైన చర్య అని వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం కొంకాపల్లిలోని మృతుడు కంచిపల్లి శ్రీనివాస్ భార్య దేవి, కుటుంబ సభ్యులను సోమవారం రాత్రి మంత్రి, ఎంపీ గంటి హరీష్ మాధుర్ పరామర్శించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఫోన్ సంభాషణ ఆధారంగా మనిషిని బతికుండగానే అతి కిరాతకంగా హత్యచేసిన నిందితులను విడిచిపెట్టేదిలేదని హెచ్చరించారు. 60 రోజుల్లో బెయిల్ తీసుకుని బయటకు వద్దామనే పిచ్చిలో వాళ్లు ఉన్నారని, కానీ ఇక్కపై అటువంటి ఆటలు చెల్లవన్నారు. మర్డర్ ఫర్ గెయిన్ అని మరో బ్యాచ్ ఉందని, వాళ్లను కూడా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. హత్యచేసిన తరువాత బయటకు వచ్చి దండులు వేసి ఊరేగింపుగా తీసుకువస్తున్నారని అలా చేసిన వారిని విడిచిపెట్టేది లేదన్నారు. హత్య చేసిన నిందితులు కనీసం కూరగాయలు కోయడానికి కూడా భయపడేలా పోలీసులే చేస్తారని హెచ్చరించారు. హత్య చేసినవారు, వారికి సహకరించినవారు, అనుచరులను విడిచిపెట్టేది లేదని.. కోనసీమలో భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని ఎంపీ పేర్కొన్నారు. హత్యకు సంబంధించిన పోస్టుమార్టం నివేదిక అందాల్సి ఉందని పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు.

సముద్రపు నాచుతో సంపద

సముద్రపు నాచు పెంపకానికి రాష్ట్రంలో మూడు జిల్లాలు ఎంపిక

అమృతానంద విశ్వవిద్యాలయ ప్రొఫెషర్ అమృతానటరాజన్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెషర్ మోహన్

ఉప్పలగుప్తం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): సముద్రపు నాచు మానవాళికి ఆరోగ్యంతో పాటు సంపదను సమకూరుస్తుందని అమృతానంద విశ్వవిద్యాలయ ప్రొఫెషర్ అమృతానటరాజన్ అన్నారు. సముద్రపు నాచును ఆహారంగా తీసుకుంటున్న జపాను దేశస్తుల ఆయుష్షు పెరిగినట్టు నిరూపితమైందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం టి.చల్లపల్లి పంచాయతీ తీరగ్రామం వాసాలతిప్పలో సోమవారం రాష్ట్ర గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్)-డీఆర్‌డీఏ, మత్స్యశాఖ సంయుక్త ఆధ్వర్యంలో డ్వాక్రా సంఘాల మత్స్యకార మహిళలకు సముద్రపు నాచు పెంపకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నాచు పెంపకానికి రాష్ట్రంలో కోనసీమ, శ్రీకాకుళం, అనకాపల్లి జిల్లాలను ఎంపిక చేసినట్టు తెలిపారు. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సముద్రపు నాచు ఎలా పెంచాలన్న అంశంపై వివరణ ఇచ్చారు. మరో ప్రొఫెషర్ మోహన్ మాట్లాడుతూ విత్తిన తర్వాత కేవలం 45 రోజుల్లో ఏ ఎరువులు వాడక్కర్లేకుండా నాచు పెరుగుతుందన్నారు. ఇక కిలో విత్తనాలు నాటితే 5 కిలోల నాచు లభిస్తుందన్నారు. కిలో ధర రూ.20-25 మధ్య ఉంటుందన్నారు. ఔషధాలు, మినరల్స్, కాస్మోటిక్స్, పచ్చళ్ళు, చేపల మేతల తయారీలో సముద్రపు నాచును వినియోగిస్తారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇసుకపట్ల జయమణీరఘుబాబు, ఆక్వా స్టేట్ డైరెక్టర్ దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, టీడీపీ మండలాధ్యక్షుడు అరిగెల నానాజీ, తెలుగు యువత నియోజక వర్గ అధ్యక్షుడు గొలకోటి చిన్నా ఉన్నారు.

రెండు టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

సీతానగరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం ముగ్గళ్ళ గ్రామం వద్ద వ్యాన్‌పై అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఎంఎస్‌వో నాగలక్ష్మి పట్టుకుని సీజ్ చేశారు. సోమవారం ముగ్గళ్ళ నుంచి కోరుకొండ వెళ్తున్న వ్యాన్‌ను నాగలక్ష్మి తనిఖీ చేయగా 2 టన్నుల రేషన్ బియ్యం ఉండడం గమనించి స్వాధీనం చేసుకున్నారు. స్థానిక విలేకర్లతో ఆమె మాట్లాడుతూ కోరుకొండ మండలం కాపవరానికి చెందిన తలారి వీరబాబు, వారా రత్నరాజు ఇనుగంటివారిపేటలో ఇళ్ల వద్ద బియ్యం కొనుగోలు చేశామని కోరుకొండ తీసుకెళ్తున్నామని తెలిపారన్నారు. రేష్ బియ్యంతో పాటుగా వ్యాన్‌ను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించి వారిపై ఫిర్యాదు చేశామన్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రామ్‌కుమార్ తెలిపారు.

హత్య కేసులో వ్యక్తి అరెస్ట్

గండేపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): యువకుడి హత్య కేసులో వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు జగ్గంపేట సీఐ వైఆర్ కెశ్రీనివాస్ తెలిపారు. కాకినాడ జిల్లా గండేపల్లి మండలం యర్రంపాలెంలో గత నెల 31న రాత్రి బుంగ బాబీ, విజ్జన చందు కొత్తగా నిర్మాణం జరుగుతున్న ఇంటి వద్ద ఫోన్‌లో పబ్జీ గేమ్ ఆడుకుంటుండగా కాకర చిన్నీ అనే వ్యక్తి వచ్చి మీరు వెళ్లిపోండి అనడంతో గొడవ జరిగింది. చిన్ని క్షణకావేశంలో బాబీని కత్తితో మెడపై నరకగా పెద్దాపురం ప్రభుతాసుపత్రికి తీసుకెళ్తుండగా మరణించాడు. సోమవారం నిందితుడు కాకర చిన్నిను పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు ఆధ్వర్యంలో జగ్గంపేట సీఐ, కిర్లంపూడి ఎస్ఐ జి.సతీష్ అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టగా 14 రోజుల రిమాండ్ విధించినట్టు తెలిపారు.

'నన్నయ'లో అంతర్ కళాశాలల

రెజ్లింగ్ పోటీలు, ఎంపికలు



రెజ్లింగ్ పోటీలను ప్రారంభిస్తున్న వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో రెజ్లింగ్ పురుష, మహిళల అంతర్‌కళాశాలల పోటీలు, విశ్వవిద్యాలయం జట్టు ఎంపికలు సోమవారం నిర్వహించారు. ఈ పోటీలను వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ ప్రారంభించారు. విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల నుంచి 51 మంది పురుష, మహిళ క్రీడాకారులు పాల్గొన్నారు. మహిళల ఫ్రీస్టైల్ విధానంలో 50 నుంచి 76 కిలోల కేటగిరి వరకూ జరిగాయి. వారిలో ఉత్తమ ప్రతిభ కనబరచిన క్రీడాకారులను విశ్వవిద్యాలయం జట్టుగా ఎంపికచేసి ఈ నెల 27 నుంచి 30 వరకూ రాజస్థాన్‌లో కోటా విశ్వవిద్యాలయంలో జరిగే సౌత్ జోన్ పోటీలకు పంపుతారు. అలాగే రెజ్లింగ్ పురుషుల ఫ్రీస్టైల్ విధానంలో 57 కిలోల నుంచి 125 కి లోల వరకూ క్రీడాకారులు పాల్గొని సత్తాచాటారు. రెజ్లింగ్ గ్రీకో రోమన్ విధానంలో 55 కిలోలనుంచి 130 కిలోల కేటగిరి వరకూ క్రీడాకారులు పాల్గొని సత్తాచాటారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన వారిని విశ్వవిద్యాలయ జట్టుగా ఎంపిక చేసి పంజాబ్‌లోని చండీగడ్ విశ్వవిద్యాలయంలో జరిగే సౌత్‌జోన్ పోటీలకు పంపుతారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కెవి.స్వామి, క్రీడాబోర్డు సహాయ కార్యదర్శి ఎంవివిఎస్.మూర్తి, కార్యనిర్వాహక చైర్మన్ డి.జ్యోతిర్మయి పరిశీలకులు నరసింహరాజు ఎంపిక కమిటీ సభ్యులు కె.కనకదుర్గ, ఏ.ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అంతర్‌జిల్లాల బాస్కెట్‌బాల్ పోటీలకు

ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక



బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్ల సభ్యులు

రామచంద్రపురం(ద్రాక్షారామ),నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్టణంలో ఈనెల 7 నుంచి 11వరకు జరుగనున్న ఏపీ అంతర్‌జిల్లాల బాస్కెట్‌బాల్ పోటీలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాలురు, బాలికల జట్లను ఎం పిక చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో రామచంద్రపురం బాస్కెట్‌బాల్ అసోసియేషన్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత నెల 31 నుంచి ఈనెల 2వరకు గన్నమని భానుమతి మెమోరియల్ ఉమ్మడి జిల్లాల బాలురు, బాలికల బాస్కెట్ బాల్ పోటీలు జరిగాయి. బాలికల విభాగంలో రామచంద్రపురం ప్రథమస్థానం, పిఠాపురం ద్వితీయస్థానం, సీబీసీ రాజమండ్రి తృతీయస్థానం దక్కించుకున్నాయి. బాలుర విభాగంలో రామచంద్రపురం ప్రథమస్థానం, డీఎన్ఏ కాకినాడ ద్వితీయస్థానం, సీబీసీ రాజమండ్రి తృతీయస్థానం దక్కించుకున్నాయి. ఇందులో బాలురు, బాలికల జట్లు ఎంపిక చేశారు. జట్లను మంత్రి సుభాష్, ఏఎంసీ చైర్మన్ అక్కల రిష్వంత్‌రాయ్, ఎస్‌కెపిపి ట్రస్టు చైర్మన్ సలాదినాయుడుమాస్టారు, రాష్ట్ర బాస్కెట్ బాల్‌అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గన్నమని చక్రవర్తి, డా.చెలికాని రామారావు, డా.కోట వెంకటసతీష్‌కుమార్ అభినందించారు.

రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా సోళ్ల బొజ్జిరెడ్డి



సోళ్ల బొజ్జిరెడ్డి



గొర్లె సునీత

రంపచోడవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా రంపచోడవరం నియోజకవర్గానికి చెందిన గిరిజన ఉపాధ్యాయుడు, బీజేపీ సీనియర్ నాయకుడు సోళ్ల బొజ్జిరెడ్డిని ఆయనతో పాటు రంపచోడవరం నియోజకవర్గానికే చెందిన టీడీపీ మహిళా విభాగం రాష్ట్ర నాయకురాలు గొర్లె సునీతను సభ్యురాలిగా నియమిస్తూ ప్రభుత్వం జీవో.నెం.155 ద్వారా ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో అత్యంత కీలకమైన ఎస్టీ కమి షన్ చైర్మన్ పదవి రంప నియోజకవర్గానికి చెందిన బీజేపీ గిరిజన నాయకుడికి దక్కడం విశేషం. సోళ్ల బొజ్జిరెడ్డి ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూనే గిరిజన హక్కులు, గిరిజన ఉపాధ్యాయ హక్కుల కోసం ఉద్యమాలు సాగించిన చరిత్ర ఉంది. ఉద్యోగాన్ని కూడా వదిలేసి పార్టీ కోసం గిరిజన గ్రామాల్లో తిరుగుతూ ఎంతో ఉనికిని తెచ్చారు. ఈ పరంపరలోనే ఆయనకు బీజేపీ 2019లో ఎమ్మెల్యే టికెట్‌ను కూడా ఇచ్చింది. ఇక చైర్మన్‌ను ఎంపిక చేసిన నియోజకవర్గం నుంచే సభ్యురాలిని కూడా ఎంపిక చేయడం తెలుగు దేశం పార్టీకి ఉన్న నిబద్ధతతకు నిదర్శనం.

సభ్యురాలిగా గొర్లె సునీత

గొర్లె సునీత మాజీ మంత్రి గొర్లె ప్రకాశరావు కుమార్తె. ఆమె స్వతహాగా ఏ పార్టీ మద్దతు లేకుండా నియోజకవర్గంలో తిరిగి, తర్వాత టీడీపీ సభ్యత్వం తీసుకుని పార్టీని బలోపేతం చేయడంలో తన వంతు కృషి చేశారు. 2019 నుంచి, 2024 ఎన్నికల వరకూ రంపచోడవరం టీడీపీ ఎమ్మెల్యే టికెట్ కోసం ప్రయత్నించారు. టికెట్ దక్కక పోయినా నిరాశ చెందకుండా పార్టీ కోసం నియోజకవర్గంలో సంచరిస్తూ కార్యకర్తలు, మండల నాయకుల సమస్యలపై స్పందించి తన వంతుగా కృషి చేస్తూ అందించిన సేవలను గుర్తించింది. దీంతో తొలుత జీసీసీ డైరెక్టర్ పదవిని ఇచ్చారు. అనంతర జరిగిన కసరత్తులో ఆమెను ఎస్టీ కమిషన్ సభ్యురాలిగా ఎంపిక చేశారు.

ఇన్నోవేషన్ కాన్‌క్లేవ్‌కు 'నన్నయ' అధ్యాపకురాలు



ఇన్నోవేషన్ కాన్‌క్లేవ్‌కు హాజరైన సుష్మప్రియ

దివాన్‌చెరువు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరుగుతున్న ఎమర్జింగ్ సైన్స్ టెక్నాలజీస్, ఇన్నోవేషన్ కాన్‌క్లేవ్ (ఈఎస్‌టీఐసీ-2025)కు తూర్పుగోదావరి జిల్లా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఫిజిక్స్ అధ్యాపకురాలు వై.సుష్మప్రియ హాజరయ్యారు. శాస్త్ర,సాంకేతిక శాఖ ఆధ్వర్యంలో సీఎస్ఐఆర్, డీఏఇ, ఐసీఎంఆర్, డీఆర్‌డీవో విద్యామంత్రిత్వశాఖ అంతరిక్ష విభాగాల సహకారంతో సోమవారం నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం ఈనెల 5 వరకూ జరుగుతుంది. ప్రధాని మోదీ విచ్చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుష్మప్రియ యువశాస్త్ర సాంకేతిక నాయకుల విభాగంలో క్వాంటం సైన్స్ అండ్ టెక్నాలజీ, అడ్వాన్డ్ మెటీరియల్స్ అండ్ మ్యానుఫాక్చరింగ్ అంశాల్లో ఎంపికవ్వగా ఆమెను వీసీఆచార్య ప్రసన్నశ్రీ అభినందించారు.

భీమవరం పీఎఫ్ ఆఫీస్‌కి అఖిత భారత స్థాయి అవార్డు

ప్రాంతీయ కమిషనర్ వెంకటేశ్వర్లు



అవార్డు స్వీకరిస్తున్న ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ వెంకటేశ్వర్లు

రాజమహేంద్రవరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) 73వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ప్రకటించిన పురస్కారాల్లో అఖిల భారత స్థాయిలో భీమవరం జిల్లా కార్యాలయానికి అవార్డు దక్కిందని ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్-2 వెంకటేశ్వర్లు కలువాయి తెలిపారు. ఈ అవార్డును భీమవరం జిల్లా కార్యాలయ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి డి.ఎలీషారావుతో కలిసి న్యూఢిల్లీలో ఈ నెల 1న జరిగిన వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమంలో కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి నుంచి అందుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఉద్యోగులను ఆయన అభినందించారు. 2022-23లో రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయం ఉత్తమ పనితీరు కనబరిచిన కార్యాలయంగా ఎంపికైందని గుర్తుచేశారు. 2023-24 ఏడాదికి స్వచ్ఛత అవార్డుల్లో అఖిల భారత స్థాయిలో మొదటి స్థానంలో నిలిచామన్నారు. సిబ్బంది నిబద్ధత, మెరుగైన సేవలకు గుర్తింపు దక్కడం గర్వకారణమని వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

'పదోన్నతులకు వృత్తి నైపుణ్య శిక్షణలు అవసరం'

సామర్లకోట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పంచాయతీ రాజ్ శాఖలో పదోన్నతులు త్వరతగతిన వస్తున్నాయని ఆయా పోస్టుల్లో మరింత వృత్తినైపుణ్యం పెంపొందించుకునేందుకు నిష్ణాతులైన ఫ్యాకల్టీలతో శిక్షణ తరగతులు ఎంతో అవసరం అని కాకినాడ జిల్లా సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్ర ప్రిన్సిపాల్ కెఎస్వీ. ప్రసాదరావు పేర్కొన్నారు. కేంద్రం ఆవరణలో ఇటీవల డిప్యూటీ ఎంపీడీవోలుగా పదోన్నతులు పొందిన అధికారులకు 2 రోజుల శిక్షణ తరగతులు, జూనియర్ అసిస్టెంట్లకు 6 రోజుల శిక్షణ తరగతులను సోమవారం ప్రిన్సిపాల్ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. పదోన్నతులు త్వరగా వస్తున్నందున ఎవరు ఎప్పుడు ఏ పాత్ర చేయాలన్నా సిద్ధంగా ఉండాలని ఇందుకు శిక్షణలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జీ.రమణ, డీడీవో డి.శ్రీనివాసరావు, ఎంపీడీవో శర్మ, సుశీల తదితరులు ఉన్నారు.

రోడ్డు దుస్థితిపై కలెక్టర్‌కు ఫిర్యాదు

అల్లవరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): చినుకు పడితే చాలు నడవలేని స్థితిలో ఉన్న ఎస్.పల్లిపాలెం-దేవగుప్తం కర్రిచెరువు వెళ్లే రోడ్డు దుస్థితిపై జిల్లా కలెక్టర్‌కు సోమవారం స్పందనలో సామాజిక కార్యకర్త కొల్లు గౌతమ్ ఫిర్యాదు చేశారు. కొమరగిరిపట్నం ఏటిగట్టురోడ్డు గోతులతో అధ్వానంగా ఉందని, వర్షం వస్తే వెళ్లే పరిస్థితి లేదన్నారు.

శంభో శంకర బోళా శంకర

- శివ నామ స్మరణతో మార్మోగిన శివాలయాలు, ప్రత్యేక పూజలు, పంచామృతాలతో అభిషేకాలు






అయినవిల్లి: ముక్తేశ్వరం శ్రీముక్తికాంత క్షణముక్తీశ్వరస్వామి, అంబాజీపేట: జి.అగ్రహారంలో ఏకాదశ రుద్రుల్లో ఒకరు సర్వేశ్వర రుద్రుడు, ముమ్మిడివరం: ఉమాసూరేశ్వరస్వామి ఆలయంలో పూజలు, అమలాపురం: బండారులంక త్రయంబకేశ్వరస్వామి ఆలయంలో అభిషేకాలు చేస్తున్న భక్తులు

అమలాపురంటౌన్/రూరల్,నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తీకమాసం సోమవారం పర్వదినాన్ని పురస్కరించుకుని అమలాపురం పట్టణ, పరిసర గ్రామాల్లోని శివాలయాలన్నీ శివ పంచాక్షరీ నామంతో మార్మోగాయి. బండారులంక శ్రీభువనేశ్వరి సమేత త్రయంబకేశ్వరస్వామి ఆలయంతో పాటు శివాలయం రోడ్డులోని సర్వ మంగళ రామలింగేశ్వరస్వామి, చెన్నమల్లేశ్వర స్వామి ఆలయాలతో శివాలయాల్లో తెల్లవారుజాము నుంచి మహిళలు దీపారాధనలు నిర్వహించారు. స్వామివారికి విశేష అభిషేకాలు జరిపారు.బండారులంకలో అన్నసమారాధన నిర్వహించారు. పిచ్చిక వెంకన్న, చింతా శంకరమూర్తి, కొండా చంటి, చింతా ఉమ, యినుమర్తి లింగ మూర్తి, గోళ్ల మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

కుండలేశ్వరంలో అన్నసమారాధన

కాట్రేనికోన, నవంబరు3(ఆంధ్రజ్యోతి): కుండలేశ్వరం పార్వతీ సమేత కుండలేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం సోమవారం సొసైటీ మాజీ చైర్మన్ నిమ్మకాయల జగ్గయ్యనాయుడు భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కుటుంబ సమేతంగా కుండలేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించి, స్వయంగా భోజనాలు వడ్డించారు. ఆరు వేల మంది భక్తులు అన్నసమారాధనలో పాల్గొన్నట్టు జగ్గయ్యనాయుడు తెలిపారు. ఎస్‌ఐ అవినాష్ ఆధ్వర్యంలోబందోబస్తు ఏర్పాటు చేశారు. టీడీపీ నాయకుడు పీఎస్ఎన్ రాజు ఆర్థిక సహాయంతో కాట్రేనికోన నుంచి కుండలేశ్వరం వరకు భక్తులకు ఉచితంగా ఆటోలు ఏర్పాటు చేశారు.

మార్మోగిన శైవ క్షేత్రాలు

ముమ్మిడివరం,నవంబరు3(ఆంధ్రజ్యోతి):కార్తీక మాసం రెండో సోమవారం మండలంలోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయాన్నే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపించారు. శైవ క్షేత్రాలన్నీ శివనామస్మరణతో మార్మోగాయి. ముమ్మిడివరంలోని ఉమాసూరేశ్వరస్వామి, కొమానపల్లి పార్వతీ సమేత చోడేశ్వర, లోకేశ్వరస్వామి, అయినాపురం ఉమాసోమేశ్వరస్వామి, అన్నంపల్లి పార్వతీ గౌతమేశ్వరస్వామి, కొత్తలంక ఉమాభోగేశ్వరస్వామి,క్రాపచింతలపూడి ఉమావల్లభేశ్వరస్వామి, ఠాణేలంక ఉమాసోమేశ్వరస్వామి ఆలయాల్లో పూజలు జరిపించారు. పల్లిపాలెంలోని శ్రీహరిసాకేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో, చినకొత్తలంకలోని శ్రీపట్టాభిరామ స్వామి ఆలయంలో కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని పూజలు జరిపించారు. సాయంత్రం దీపార్చన కార్యక్రమం నిర్వహించారు.

శైవ క్షేత్రాలకు కార్తీక శోభ

అయినవిల్లి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం రెండో సోమవారం సందర్భంగా శైవ క్షేత్రాల్లో కార్తీకశోభ నెలకొంది. తెల్లవారుజాము నుంచి భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుని అభిషేకాలు, అర్చనలు జరిపించుకున్నారు. ముక్తేశ్వరంలో గల శ్రీముక్తికాంత క్షణముక్తీశ్వరస్వామి, శ్రీరాజరాజేశ్వరి సమేత ముక్తేశ్వరాలయం, అయినవిల్లి సిద్ధివినాయక దేవస్థానంలోని ఉపాలయమైన శ్రీఅన్నపూర్ణా సమేత వీరేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్వామివారికి లఘున్యాస పూర్వక అభిషేకాలు నిర్వహించారు. అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయంలో భక్తుల రద్దీ దృష్ట్యా అన్నప్రసాదాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ సహాయ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది, భక్తులకు అసౌకర్యం కలగకుండా సేవలందించారు. సుదూరప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామినిదర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వరునికి లక్ష బిల్వార్చన

మామిడికుదురు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి గ్రామంలోవేంచేసి ఉన్న శ్రీఅన్నపూర్ణ కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన పూజా కార్యక్రమాన్ని సోమవారం భక్తులు ఘనంగా నిర్వహించారు. సోమవారం కావడంతో శైవ క్షేత్రాలు భక్తులతో పోటెత్తాయి. వేకువజామునే భక్తులు శివాలయాలను దర్శించుకుని అభిషేకాలు చేయించుకున్నారు. అప్పనపల్లి ఆలయంలో శ్రీబాలబాలాజీ గ్రామ శెట్టిబలిజ సంఘ ఆధ్వర్యంలో జరిగిన లక్షబిల్వార్చన పూజలో భాగంగా విఘ్నేశ్వరపూజ, విశ్వేశ్వరస్వామికి పంచామృతాలతో అభిషేకాలు, అన్నపూర్ణాదేవికి లక్ష కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. 150మంది భక్త దంపతులు ఈపూజాకార్యక్రమంలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని కమణీయంగా నిర్వహించారు. ఈపూజా కార్యక్రమాలన్నీ భాగవతుల సత్యనారాయణ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా జరిగాయి.

ఓంకార నాదంతో ప్రతిధ్వనించి..

ఐ.పోలవరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం రెండో సోమవారం మురమళ్ళ వీరేశ్వరస్వామి ఆలయం ఓంకార నాదంతో ప్రతిధ్వనించింది. వేకువజాము నుంచి భక్తులు గోదావరిలో స్నానమాచరించి, శ్రీభద్రకాళీసమేతవీరేశ్వరస్వామిని దర్శించుకున్నారు. భక్తులు స్వామికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు వీరేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మురమళ్ళ శ్రీసాయి ఆక్వా ఏజన్సీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ట్రస్టుబోర్డు చైర్మన్ దాట్ల రామకృష్ణంరాజు, అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శైవాలయాల్లో అభిషేకాలు

అల్లవరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం త్రయోదశి సోమవారం సందర్భంగా పురాణ ప్రసిద్ధి పొందిన రామేశ్వరం, లక్ష్మణేశ్వరం, బోడసకుర్రు శివాలయాలతో పాటు పలు గ్రామాల్లోని శివాలయాల్లో వేకువజాము నుంచి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామేశ్వరం పార్వతీ రామేశ్వరస్వామి ఆలయంలో చైర్మన్ అంగాని రామారావు ఆధ్వర్యంలో సోమవారం జరిగిన అభిషేకాలు, పూజలకు భక్తులు పోటెత్తారు. పుల్లేటికుర్తి ఫణిశర్మ ఆధ్వర్యంలో రామేశ్వరునికి పండ్ల రసాలతో అభిషేకాలు జరిగాయి. చక్కా ఈశ్వరరావు ఆర్థికసాయంతో భక్తులకు అన్నదానం జరిగింది. లక్ష్మణేశ్వరం, గోడి, బోడసకుర్రు, కొమరగిరిపట్నం, బెండమూర్లంక, గోడిలంక, అల్లవరం, దేవగుప్తం తదితర గ్రామాల్లో శివాలయాల వద్ద కార్తీకపూజలు, అభిషేకాలు ఘనంగా జరిగాయి.

యానాంలో ఆలయాలు కిటకిట

యానాం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం రెండో సోమవారం యానాంలోని అన్ని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అధిక సంఖ్యలో మహిళలు స్థానిక గౌతమిగోదావరి పుష్కరఘాట్‌కు తరలివచ్చారు. కార్తీక దీపాలు వెలిగించి గోదావరిలో వదిలారు. దీంతో రాజీవ్ గాంధీబీచ్, శివంబాత్‌భక్తులతో కిటకిటలాడాయి. బ్రాహ్మణులకు దీపదానం చేసి కార్తీక పూజలు చేశారు. అభయ ఆంజేయస్వామికి, రావిచెట్టు వద్ద దీపాలు వెలిగించి పూజలు చేశారు. దీంతో ఫెర్రీ రోడ్డు కార్తీక శోభతో కళకళలాడింది. స్థానిక శివాలయంలో ఉన్న రాజరాజేశ్వరస్వామికి తెల్లవారుజాము నుంచి భక్తులు పూజలు చేశారు.

ఘనంగా కార్తీక పూజలు

అంతర్వేది, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): అంతర్వేది పుణ్యక్షేత్రంలో బ్రహ్మచే కొలువై ఉన్న శ్రీ పార్వతీ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో కార్తీక సోమవారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నందీశ్వరుని వద్ద దీపారాధనలు నిర్వహించిన అనంతరం పంచామృతాలతో స్వామివారికి అభిషేకాలు జరిపించుకున్నారు. రామేశ్వరం కృతకత్యారామలింగేశ్వర స్వామి, మోరి ఉమాలింగేశ్వరస్వామి, అంతర్వేది కొత్తవంతెన, సఖినేటిపల్లి సెంటర్ శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

భక్తులతో పోటెత్తిన శివాలయాలు

అంబాజీపేట, నవంబరు3(ఆంధ్రజ్యోతి):కార్తీకమాసం రెండో సోమవారం మండలంలోని ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. వేకువజాము నుంచి శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.ప్రైవేట్ వాహనాలు, వివిధ డిపోల నుంచి సుమారు రెండు వేల మందికి పైగా భక్తులు బస్సుల్లో ఏకాదశ రుద్రుల దర్శనానికి తరలివచ్చారు. వేకుమజాము నుంచి శివాలయాల్లో అర్చకులు స్వామి వార్లకు అభిషేకాలను నిర్వహించారు. శివుడిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. మాచరంలోని శ్రీపార్వతీ రాజేశ్వరస్వామి ఆలయంలో మాస లక్ష బిల్వార్చన పూజలు నిర్వహించారు.

నాణ్యతతో పనులు చేపట్టాలి

అంబాజీపేట, నవంబరు3(ఆంధ్రజ్యోతి): పాఠశాల నిర్మాణ పనులు నాణ్యతతో చేపట్టాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి సూచించారు. తొండవరం శివారు వెన్నపు వారికాలనీలో నూతనంగా నిర్మిస్తున్న ఎంపీపీ పాఠశాల భవన నిర్మాణానికి సోమవారం భూమి పూజ చేశారు. ప్రహరీ నిర్మాణానికి రూ.9.37లక్షలు, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.3.80లక్షలు, భవనం మేజర్ రిపేర్లకు రూ.6లక్షలు నిధులు మంజూరయ్యాయన్నారు. ఎంఈవోలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, సర్పంచ్ పేరాబత్తుల దొరబాబు, ఎంపీటీసీ వాకపల్లి దొరబాబు, టీడీపీ నాయకులు పితాని కేశవరావు, పితాని ఈశ్వరరావు పాల్గొన్నారు.

మాలల ఆత్మీయ సమావేశం

మలికిపురం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గంలో ఎస్సీ సామాజిక వర్గీయులు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలు పరిష్కరిస్తానని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. విశ్వేశ్వరాయపురంలో గెడ్డం సింహ అధ్యక్షతన జరిగిన మాలల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గెడ్డం సింహ, బత్తుల మురళీకృష్ణ, తాడి సత్యనారాయణ, సరెళ్ల విజయప్రసాద్, గెడ్డం తులసీభాస్కర్, దేవ రాజేంద్రప్రసాద్, పొలమూరి శ్యామ్‌బాబు, నల్లి శివ, బత్తుల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ సోము వీర్రాజుకు నేతల శుభాకాంక్షలు

పి.గన్నవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): శాసనమండలిలో బీజేపీ ఫ్లోర్ లీడర్‌గా ఎన్నికైన ఎమ్మెల్సీ సోము వీర్రాజును సోమవారం మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా, బీజేపీ నాయకులు కొంతమూరులోని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా వీర్రాజును ఘనంగా సత్కరించారు. సత్కరించిన వారిలో జిల్లా ఆత్మనిర్భర్ కన్వీనర్ చీకరమిల్లి శ్రీనివాసరావు, నాయకులు కోటిపల్లి సాయిరామ్, గంటా పెద్దిరాజు ఉన్నారు.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

- పారిశుధ్య కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

అమలాపురం టౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): అమలాపురం పురపాలక సంఘంలో వికాసా ద్వారా పనిచేస్తున్న 76మంది పారిశుధ్య కార్మికులను తొలగించడాన్ని నిరసిస్తూ మున్సిపల్ వర్కర్స్ యూనియన్, సీఐటీయూల ఆధ్వర్యంలో సోమవారం ఉదయం ధర్నా నిర్వహించారు. వర్కర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొప్పుల బాబి ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసనలో పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొప్పుల సత్తిబాబు, సంఘ నాయకులు పారిశుధ్య కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. పురపాలక సంఘంలో 45మంది శాశ్వత ఉద్యోగులు, 105మంది ఆపాస్కర్ ఉద్యోగులతో పాటు వికాస ఆధ్వర్యంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు ధర్నాలో పాల్గొన్నారు. తొలగించిన వికాస కార్మికులను తక్షణం విధుల్లోకి తీసుకోవాలని, లేనిపక్షంలో కార్మికులంతా సమ్మెబాట పడతామని బాబి హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్మికసంఘ నాయకులు కొప్పుల కృష్ణ, మల్లవరపు సత్యనారాయణ, నక్కా నరసింహమూర్తి, చోడే రాంబాబు, కాలేటి సుమన్, సీఐటీయూ అధ్యక్షుడు తొమ్మండ్రు గోపి తదితరులు పాల్గొన్నారు.

'మానవ మృగాన్ని కఠినంగా శిక్షించాలి'



నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

అమలాపురం టౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం చేసిన మానవ మృగాన్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో నిరసన ప్రదర్శన చేపట్టారు. నిందితుడైన రాయపురెడ్డి బాబీని కఠినంగా శిక్షించాలని, పైశాచిక చర్యలకు పాల్పడేవారికి సమాజంలో స్థానం లేదని పేర్కొన్నారు. బాలిక కుటుంబానికి తక్షణం రూ.50లక్షలు ఆర్థికసాయం అందించి 90రోజుల్లో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారణ పూర్తిచేసి నిందితుడిని కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు శెట్టిబత్తుల తులసీరావు, బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పొలమూరి మోహన్ బాబు, వివిధ యూనియన్‌ల నాయకులు నకులరాజు, గుదే దుర్గాప్రసాద్, నూకల బలరామ్, కె.కృష్ణవేణి, కె.శంకర్, సురేంద్ర, ఎంటీవీ సుబ్బారావు, జి.దైవకృప, బొంతు రమణ, ఎ.రవి, అమలదాసు బాబూరావు, నామాడి శ్రీధర్, పి.అమూల్య తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాజెక్టులకు నిధులు కేటాయించండి



కేంద్రపర్యాటకశాఖ సంయుక్త కార్యదర్శి సుమాన్ బిల్లాకు వినతిపత్రం అందజేస్తున్న మల్లాడి

యానాం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): యానాం పర్యాటక పాజెక్టులకు కేంద్ర ప్రభు త్వం నుంచి నిధులు కేటాయించాలని కేంద్ర పర్యాటక శాఖ సంయుక్త కార్యదర్శి, డైరెక్టర్ జనరల్ సుమాన్ బిల్లాను పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు కోరారు. ఢిల్లీ పర్యటనకు వెళ్లిన మల్లాడి పలువురు కేంద్ర ప్రభుత్వ ఆధికారులను కలిసి వినతులు అందజేశారు. సుమాన్ బిల్లాను కలిసిన మల్లాడి యానాం పర్యాటక ప్రాజెక్టులపై చర్చించారు. యానాంలో ఒబ్లిస్క్ (ఈఫిల్)టవర్‌ను ఆధునికీకరణ చేయడానికి, కన్వెన్షన్ సెం టర్ నిర్మించి ప్రత్యేక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి రూ.20కోట్లు నిధులు విడుదల చేయాలని కోరారు. 2027లో జరగనున్న గోదావరి పుష్కరాలకు యానాం రానున్న భక్తులకు కావాల్సిన సదుపాయలు, రాజీవ్‌బీచ్ అభివృద్ధికి రూ.16.45కోట్లు కేటాయించాలని కోరారు. అంబేడ్కర్‌నగర్, బుద్ధాపార్క్, యానాం ముఖద్వారం అభివృద్ధి, బోటనికల్ గార్డెన్ మరమ్మతులు, సమగ్ర అభివృద్ధికి రూ.3కోట్లు నిదులు ప్రస్తుత ఆర్‌ఈలో కేటాయించాలని కోరారు. యానాం గౌతమి గోదావరి రాజీవ్‌బీచ్ వద్ద వాటర్‌స్పోర్ట్స్ (హైస్పీడ్ బోట్లు) నిర్వహణకు రూ.10కోట్లు మంజూరు చేయాలని మల్లాడి కోరారు. దీనిపై బిల్లా సానుకూలంగా స్పందించారని మల్లాడి తెలిపారు.

బీసీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఫణికుమార్

అంతర్వేది, నవంబరు3(ఆంధ్రజ్యోతి):రామేశ్వరానికి చెందిన జనసేన నాయకుడు గుబ్బల ఫణికుమార్‌ను ఇటీవల ప్రభుత్వం బీసీ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించారు. సోమవారం విజయవాడ కార్పొరేషన్ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేశారు.

డీఎంహెచ్‌వోకు అవార్డు




ముమ్మిడివరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): తుఫాన్ సమయంలో విశిష్ట సేవలు అందించినందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎం.దుర్గారావుదొరకు విశిష్ట సేవా పురస్కార అవార్డు లభించింది. విశిష్ట సేవ ప్రశంసాపత్రం, అవార్డును సోమవారం అమలాపురంలో జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ చేతులమీదుగా అందుకున్నారు. దుర్గారావుదొరను కార్యాలయ సిబ్బంది, వైద్యులు అభినందించారు.

'వీరవేణు మృతి బాధాకరం'

మామిడికుదురు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ సమయంలో తాడిచెట్టు పడి గూడపల్లి వీరవేణు మృతి చెందడం బాధాకరమని నాయీబ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం పేర్కొన్నారు. ఆయన కార్పొరేషన్ డైరెక్టర్లతో కలిసి సోమవారం వీరవేణు కుటుంబ సభ్యులను పరామర్శించి ఆమె చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. తనవంతు సాయంగా రూ.5వేలు అందించారు. డైరెక్టర్లు కొరుప్రోలు నూకరాజు, వై.ఏసు, లంక రత్నారావు, సుందరపల్లి గోపాలకృష్ణ, ఎం.నాగసత్యనారాయణ, మానుకొండ దుర్గాప్రసాద్, ర్యాలి లోవరాజు, ఆర్.శ్రీను, ఎస్.సుబ్బారావు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం



ముమ్మిడివరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): అన్నంపల్లి పంచాయతీ పరిధిలో చింతపల్లిలంక గ్రామానికి చెందిన 17ఏళ్ల యువతి అదృశ్యమైంది. నవంబరు 1వ తేదీ శనివారం ఉదయం వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లి వస్తాననిచెప్పి ఇంటి నుంచి వెళ్లిన యశశ్రీమహేశ్వరి తిరిగి ఇంటికి చేరలేదు. ఆమె మానసిక స్థితి సరిగా లేదని, ఆచూకీ తెలిసినవారు తండ్రి మల్లాడి శ్రీనివాస్ 8985254749 లేదా ఎస్ఐ డి.జ్వాలాసాగర్ 9440796564 నంబర్లకు తెలియచేయాలని కోరుతున్నారు. తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలి

అంబాజీపేట, నవంబరు3(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు నివాస ప్రాంతాల మధ్య మురుగునిల్వ ఉండటంతో దోమలు వ్యాప్తి చెంది ప్రజలు రోగాల బారిన పడతారని జిల్లా మలేరియా అధికారి ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు. తొండవరంలో ఆయన పర్యటించి పలు ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సర్పంచ్ పేరాబత్తుల దొరబాబు, పంచాయతీ కార్యదర్శి లోవబాబు, హెల్త్‌అసిస్టెంట్ జేవీఆర్ ప్రసాద్ పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన డిప్యూటీ తహశీల్దార్ బాలశ్రీ



యానాం, నవంబరు3(ఆంధ్రజ్యోతి):యానాం డిప్యూటీ తహశీల్దార్‌గా యానానికి చెందిన జువ్వాల బాలశ్రీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల నిర్వహించిన డీటీ రాత పరీక్షలో ఆమె ఉద్యోగానికి ఎంపికయ్యారు. ఇప్పటివరకు యానాం డీటీగా పనిచేసిన జ్యోతి వెంకటేశ్వరరావు యానాం తూనికలశాఖ డీటీగా బాధతలు స్వీకరించారు.

ఒకేషనల్ విద్యార్థులకు స్కిల్ కాంపిటేషన్

అమలాపురంరూరల్, నవంబరు3(ఆంధ్రజ్యోతి): ఒకేషనల్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు అమలాపురం జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో స్కిల్ కాంపిటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. మండల పరిధిలోని విద్యార్థులకు హెచ్ఎం బీవీ రామకృష్ణ ఆధ్వర్యంలో స్కిల్‌కాంపిటేషన్ నిర్వహించారు. సమగ్రశిక్షకు చెందిన జిల్లా అధికారులు జీసీడీవో డాక్టర్ ఎంఎకే భీమారావు, రమేష్, రాజేశ్వరరావు, జ్యోతి ముఖ్య అతిథులుగా హాజరై పోటీలను ప్రారంభించారు.ఎలక్ట్రానిక్స్, అగ్రికల్చర్ విభాగంలో పోటీలు నిర్వహించి ప్రథమస్థానం సాధించిన వారిని జిల్లాస్థాయి పోటీలకు పంపిస్తున్నట్టు ప్రకటించారు. సైన్స్ ఉపాధ్యాయులు రుక్మిణి, సత్యనారాయణ పాల్గొన్నారు.

బాధితులకు సాయం అందజేత

ముమ్మిడివరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ వల్ల నష్టపోయిన బాధితులందరినీ ఆదుకుంటామని ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పేర్కొన్నారు. సీహెచ్ గున్నేపల్లిలో 35కుటుంబాలకు నగదు, నిత్యావసరాల కిట్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో గొలకోటి దొరబాబు, యాళ్ల ఉదయ్, పాము హేమకుమారి, గాలిదేవర బుల్లి, సకిలే వెంకటేశ్వరరావు, గొలకోటి తాతాజీ, శీలం సత్తిబాబు, కార్యదర్శి హిమబిందు పాల్గొన్నారు.

ముక్తేశ్వరంలో గోదాముల నిర్మాణానికి ప్రతిపాదనలు

అంబాజీపేట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట మార్కెట్ యార్డు పరిధిలో ముక్తేశ్వరంలో ఉన్న స్థలంలో గోదాములు నిర్మించేందుకు ప్రతిపాదనలు రూపొందించినట్లు ఏఎంసీ చైర్మన్ చిట్టూరి శ్రీనివాస్ తెలిపారు. అంబాజీపేట మార్కెట్ కమిటీలో చైర్మన్ శ్రీనివాస్ అధ్యక్షతన సోమవారం సమావేశం జరిగింది. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో లింక్‌రోడ్లు నిర్మించేందుకు ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపించామన్నారు. మొంథా తుఫాన్‌లో మార్కెట్ కమిటీ ఉద్యోగులు, సిబ్బంది అందించిన సేవలు అభినందనీయమని మార్కెటింగ్ జిల్లా శాఖాధికారి కె.విశాలక్ష్మి అన్నారు. అనంతరం జిల్లా మార్కెటింగ్ శాఖాధికారిని సత్కరించారు. ఏఎంసీ కార్యదర్శి ఐ.రమేష్, వైస్‌చైర్మన్ కొర్లపాటి వెంకటేశ్వరరావు, డైరెక్టర్లు మట్టపర్తి సోమేశ్వరరావు, గంధం వెంకటేశ్వరరావు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

అమలాపురం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సహాయ నిధి నుంచి వచ్చిన 17.25లక్షల చెక్కులను లబ్ధిదారులకు సోమవారం అమలాపురంలోని తన కార్యాలయంలో ఎంపీ గంటి హరీష్‌మాధుర్ పంపిణీ చేశారు. పేదలను ఆదుకోవడంలో చంద్రబాబు ఎప్పుడూ ముందుంటారని ఆయన పేర్కొన్నారు. అయినవిల్లి మండలానికి చెందిన టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు నిత్యావసరాల పంపిణీ

పి.గన్నవరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా ఉపాధి కోల్పోయిన మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం సాయం ప్రకటించింది. లంకలగన్నవరంలో 442మంది మత్స్యకారులకు 50కిలోల బియ్యం, నిత్యావసరాలను సోమవారం ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, కూటమి నాయకులు, సర్పంచ్ గనిశెట్టి గంగాభవాని అందజేశారు. ఎంపీటీసీ అవనిగడ్డ సత్తిబాబు, మార్కెట్‌కమిటీ డైరెక్టర్ చిట్టాల జోగేశ్వరరావు పాల్గొన్నారు.

రామేశ్వరంలో మందుబాబు వీరంగం

అల్లవరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): వాసాలతిప్పకు చెందిన బాలరాజు మద్యం సేవించి రామేశ్వరం శివాలయం సెంటర్‌లో సోమవారం వీరంగం చేశాడు. దారిన వెళ్లేవారిని దుర్భాషలాడుతూ హంగామా చేశాడు.



మండపేట

అయ్యప్పస్వాముల నగర సంకీర్తన

ఆత్రేయపురం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురంలో సోమవారం అయ్యప్పస్వాములు నగర సంకీర్తన నిర్వహించారు. గంగరాజు గురుస్వామి ఆధ్వర్యంలో 40 మంది స్వామివారిని ఊరేగిస్తూ సంకీర్తన జరిపారు. అనంతరం వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప శరణు ఘోషతో ఆ ప్రాంతం మార్మోగింది.

కైలాసవాసా శిరసా నమామి

• భక్తులతో పోటెత్తిన శైవక్షేత్రాలు • ప్రత్యేక పూజలు, అభిషేకాలు • తెల్లవారుజాము నుంచే ఆలయాల వద్ద బారులుతీరిన భక్తజనం


ప్రత్యేక అలంకరణలో ఆత్రేయపురం మండలం వాడపల్లిలోని విశ్వేశ్వరస్వామి


కె.గంగవరం మండలం యండగండిలోని శివాలయంలో పూజలు చేస్తున్న అర్చకులు


కపిలేశ్వరపురం మండలం వల్లూరులో ప్రత్యేక అలంకరణలో పార్వతీ సమేత అగస్త్రేశ్వరస్వామి


మండపేటలోని సంగమేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వేగుళ్ల


కొత్తపేట మండలం పలివెల ఉమాకొప్పేశ్వరస్వామి ఆలయంలో శివునికి పంచామృతాభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం రెండవ సోమవారం సందర్భంగా ద్రాక్షారామ భీమేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే భక్తుల రాక మొదలైంది. భక్తజనం భీమేశ్వరస్వామి, మాణిక్యాంబ అమ్మవార్లను దర్శించుకునేందుకు బారులుతీరారు. సామూహిక అభిషేకాలు నిర్వహించారు. అశ్వత్థనారాయణ వృక్షం వద్ద కార్తీకదీపాలు వెలిగించారు. ఉచిత దర్శనం క్యూలైన్లలో భక్తజనం బారులుతీరారు. ఆలయ సిబ్బంది, సేవకులు, ఇతర దేవాలయాల సిబ్బంది భక్తులకు సేవలు అందించారు. ఆలయ సహాయ కమిషనరు అల్లు వెంకట దుర్గాభవానీ, ఉత్సవ ప్రత్యేకాధికారి నాగేశ్వరరావు ఆయా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయంలో రైసుమిల్లర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం జరిపారు. పైండా వారి సత్రంలో యధావిధిగా అన్నదానం నిర్వహించారు.

ఫలించిన క్యూలైన్లు మార్పు: కార్తీకమాసాన్ని పురస్కరించుకుని క్యూలైన్ల మార్పులు సత్ఫలితాలు ఇచ్చింది. ఉచిత, ప్రత్యేక దర్శనం, విశిష్ట దర్శనం క్యూలైన్లు వేరు చేశారు. ఉచిత దర్శనం క్యూలైను సప్తగోదావరి ఒడ్డు నుంచి తూర్పుగోపురం మీదుగా ఏర్పాటు చేశారు. ప్రత్యేక దర్శనం క్యూలైను దక్షిణ గోపురం నుంచి దక్షిణం వైపు మెట్ల మీదుగా కల్పించారు. విశిష్ట దర్శనం ఆలయ వెనుక భాగం ఇనుప మెట్ల నుంచి ఏర్పాటు చేయడంతో భక్తులకు దర్శనం సాఫీగా కొనసాగింది. మూడు క్యూలైన్లు ఆలయ ప్రవేశం, దర్శనం అనంతరం బయటకు వచ్చే మార్గాలు కూడా వేరు చేయడంతో ఆలయంలో రద్దీ కనిపించడం లేదు. ముఖ్యంగా దక్షిణ గోపురం వద్ద రద్దీ నియంత్రణలోకి వచ్చింది.

మార్మోగిన శైవక్షేత్రాలు

ఆలమూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారం సందర్భంగా మండలంలోని ఆయా శైవక్షేత్రాలు శివనామస్మరణతో మారుమోగాయి. తెల్లవారుజాము నుంచే భక్తుల రాకతో ఆలయాలు కిటకిటలాడాయి. మండలంలో శైవక్షేత్రాలుగా పేరొందిన ఆలమూరు విక్రమభట్టిశ్వరస్వామి, పెనికేరు ఇష్టకాంతేశ్వరస్వామి, చింతలూరు పృథ్వీశ్వరస్వామి, మూలస్థానం మూలేశ్వరరావు, జొన్నాడ పార్వతి రామలింగేశ్వరస్వామి, కాశీవిశ్వేశ్వరస్వామి, మడికి సోమేశ్వరస్వామితోపాటు పెదపళ్ల, పినపళ్ల, సంధిపూడి, కలవచర్ల, నర్సిపూడి, మోదుకూరు, గుమ్మిలేరు, నవాబుపేట, చొప్పెల్ల, బడుగువానిలంక గ్రామాలలోని శివాలయాల్లో తెల్లవారుజాము నుంచే భక్తులు స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు.

ఉమా కమండలేశ్వరస్వామి ఆలయంలో

ఆత్రేయపురం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ర్యాలి ఉమా కమండలేశ్వరస్వామి ఆలయంలో భక్తులు బారులుతీరారు. వేకువజామునే భక్తజనం దీపాలంకరణ, శివుడికి అభిషేకాలు నిర్వహించారు. శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. వాడపల్లి విశ్వేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు జరిపారు. ఆయా గ్రామాల్లోని శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి.

కోటిపల్లి సోమేశ్వర ఆలయంలో

కె.గంగవరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం రెండో సోమవారం సందర్భంగా కోటిపల్లి క్షేత్రం శివనామస్మరణతో మార్మోగింది. వేకువజాము నుంచే భక్తజనం గోదావరి నదిలో స్నానాలు చేసి సోమేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని ఆలయంలో స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, లక్షపత్రి పూజలు చేశారు. ఆలయంలో మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు.


రావులపాలెం మండలం ముమ్మిడివరప్పాడులో ప్రత్యేక అలంకరణలో వీరేశ్వరస్వామి

కిటకిటలాడిన శివాలయాలు: కార్తీకమాసం రెండో సోమవారం సందర్భంగా మండలంలోని శివాలయాలు కిటకిటలాడాయి. భక్తులు ఆయా గ్రామాల్లోని శివాలయాల్లో ఏకాదశ రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల్లో మహిళలు కార్తీకదీపాలు వెలిగించారు. యండగండి, పామర్రు, అముజూరు, కూళ్ల, పాణింగపల్లి, సత్యవాడ, గంగవరం, దంగేరు, బాలాంత్రం, భట్లపాలిక, మసకపల్లి, యర్రపోతవరం, కుందూరు గ్రామాల్లోని శివాలయాలు కిటకిటలాడాయి. గంగవరం విశ్వేశ్వరస్వామి ఆలయంలో అన్నసమారాధన జరిపారు. అధికసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

పాపవినాశేశ్వరస్వామి ఆలయంలో

కపిలేశ్వరపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. కపిలేశ్వరపురంలోని దుర్గా పార్వతి సమేత పాపవినాశేశ్వరస్వామి ఆలయం కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిక్కిరిసింది. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యార్థులు 108 ప్రదక్షిణల అనంతరం స్వామివారికి పూజలు చేశారు. ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ చైర్మన్ పితాని సూర్యచంద్రరావు తెలిపారు. కార్యక్రమం లో గ్రామస్తులతో పాటు వివిధ గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వేగుళ్ల పూజలు

మండపేట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండపేటలో వున్న జనార్దనస్వామి అగస్త్రేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. తొలుత స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు అనంతరం ఆయన వేద పండితుల ఆశీర్వచనం తీసుకున్నారు. ఆలయ నిర్వాహకులు ఆయనకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

నేడు సంగమేశ్వరస్వామికి అన్నాభిషేకం: ఏడిద సంగమేశ్వరంలోనున్న స్వామివారి ఆలయంలో మంగళవారం అన్నాభిషేకం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని స్వామివారికి అర్చకుడు శర్మ సారధ్యంలో వేదపండితుల మధ్య జరిగే ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్ని తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని నిర్వాహకులు కోరారు.

రాయవరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం రెండవ సోమవారాన్ని పురస్కరించుకుని మండలంలోని శైవక్షేత్రాలు శివనామస్మరణ మార్మోగాయి. మండలంలోని అష్టసోమేశ్వరాలయాలుగా పేరుగాంచిన సోమేశ్వరం బాలత్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి, వెంటూరు ఉమా సోమేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సోమేశ్వరంలో పురోహితులు పరిటాల సుబ్రహ్మణ్యశర్మ, పరిటాల సోమశేఖరశర్మ ఆధ్వర్యంలో సోమేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రాయవరం పార్వతీ సమేత రాజరాజేశ్వరస్వామి ఆలయంలో విలపర్తి ఫణిధర శర్మ, శశిధరశర్మ ఆధ్వర్యంలో వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు జరిపారు. రాయవరం తుల్యాబాగ సమీపంలో ఉన్న కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయం, చెల్లూరు అగస్త్రేశ్వరస్వామి, లొల్ల రామలింగేశ్వరస్వామి, పసలపూడి శివాలయం, మాచవరం శివాలయాల్లో వేకువజాము నుంచే భక్తులతో కిటకిటలాడాయి.

ఉమాకొప్పిలింగేశ్వరస్వామి ఆలయంలో

కొత్తపేట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పలివెల ఉమాకొప్పిలింగేశ్వరస్వామి ఆలయం కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని శివనామస్మరణతో మార్మోగింది. తెల్లవారుజాము నుంచే భక్తులు పోటెత్తారు. అర్చకులు స్వామివారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దేవస్థానం ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు. మహిళలు కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. మండలంలోని ఆయా శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. కార్తీక సోమవారం సందర్భంగా ఏనుగుమహల్ గాయిత్రీ బ్రాహ్మణ సంఘం మందపల్లి శనేశ్వరస్వామికి లక్షబిల్వార్చన నిర్వహించారు.

రావులపాలెం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా శివాలయాల్లో కార్తీక సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని ఆయా శైవక్షేత్రాల్లో సోమవారం ఉదయం నుంచి స్వామివారికి అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకం జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.


ప్రత్యేక అలంకరణలో రాయవరంలోని సోమేశ్వరస్వామివారు

పారిశ్రామిక ప్రగతికి కూటమి ప్రభుత్వం కృషి


సదస్సులో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే బండారు

ఆలమూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని పారిశ్రామిక ప్రగతిని సాధించే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. చెముడులంకలో సోమవారం ఎంఎస్ఎంఈ అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని డ్వాక్రా తోపాటు పరిశ్రమల స్థాపనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ సాయిజయచంద్ర, ఇండస్ట్రియల్ మేనేజింగ్ డైరెక్టర్ అరుణ, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ రాజు, పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ జోనల్ మేనేజర్ శ్రీనివాస్, నాబార్డు బ్యాంక్ మేనేజర్ స్వామినాయుడు, ఆలమూరు ఎంపీడీవో ఎ.రాజు, తహశీల్దార్ కెజె.ప్రకాష్‌బాబు తదితరులు ప్రసంగించారు.

ఎమ్మెల్యేకు సత్కారం: ఇటీవల తుఫాన్ సమయంలో కృషి చేసిన కొత్తపేట ఎమ్మెల్యే సత్యానందరావు ప్రభుత్వం నుంచి ఉత్తమ సేవ పురస్కారం అందుకున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఆలమూరు ఎంపీడీవో ఎ.రాజు అధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు సోమవారం ఎమ్మెల్యేను సత్కరించారు. పలువురు అధికారులు, నాయకులు ఎమ్మెల్యేను అభినందించారు.

'యుగ పురుషుడు ఎన్‌టీఆర్'


ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి సుభాష్, ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజలే దేవుళ్లు...సమాజమే దేవాలయం అని భావించి పరిపాలనలో ఎన్నో సంస్కరణలకు నాంది పలికిన ఎన్టీఆర్ యుగపురుషుడని మంత్రి సుభాష్ అన్నారు. సోమవారం కొత్తూరులో ఏర్పాటు చేసిన ఎన్‌టీఆర్ విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన టీడీపీ సీనియర్ నాయకులు గరిగిపాటి సూర్యనారాయణ, గ్రామ పెద్దలను మంత్రి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, మాజీ ఎంపీ చుండ్రు శ్రీహరిరావు తదితరులు మాట్లాడారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ కొమరిన వీర్రాజు, మాజీ కౌన్సిలరు దంగేటి గౌరీశంకర్, టీడీపీ మండల అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీను, పట్టణ అధ్యక్షుడు ఉండవల్లి శివ, కంచుమర్తి బాబూరావు, చందమామ వాసు, కవల నానాజీ, నారపురెడ్డి బలరామ్ తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టం నమోదు పూర్తి : ఏవో రవి



కపిలేశ్వరపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల తుఫాన్ వల్ల వరి పంటకు జరిగిన నష్టం నమోదు పూర్తయ్యిందని మండల వ్యవసాయాధికారి (ఏవో) బి.రవి తెలిపారు. సోమవారం కపిలేశ్వరపురంలో ఆయన మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతుల జాబితా గ్రామ రైతుసేవా కేంద్రాల వద్ద వ్యవసాయ సహాయ అధికారులు ప్రదర్శించారన్నారు. తమ గ్రామాల పరిధిలో ఉన్న రైతు సేవా కేంద్రం వద్ద ఉంచిన రైతుల జాబితాలో తమ పేరు లేనట్టయితే అగ్రికల్చర్ అసిస్టెంట్‌కు తెలియజేయవచ్చన్నారు. పంట నష్టం వివరాలను జిల్లా కలెక్టర్‌కు సమర్పిస్తామన్నారు. బాధిత రైతుల బ్యాంకు ఖాతాకు ప్రభుత్వ పరిహారం జమవుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ వ్యవసాయ సహాయకులు బాలసాయి, నాగబాబు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి భూమిపూజ

ఆలమూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆలమూరు గ్రామదేవత రావులమ్మ ఆలయ పునర్నిర్మాణానికి సోమవారం భూమిపూజ నిర్వహించారు. అమ్మవారి ఆలయం శిథిలావస్థకు చేరడంతో గ్రామస్తుల ఆర్థికసాయంతో ఆలయ పునర్నిర్మాణం చేపట్టేందుకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా వేదపండితులు కాళ్లకూరి దుర్గాప్రసాద్ సారధ్యంలో అర్చకులు వేదుల లక్ష్మణశర్మ అధ్వర్యంలో పలువురు వేదపండితులు హోమాలు, ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం గ్రామానికి చెందిన కొత్తపేట నియోజకవర్గ రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వంటిపల్లి పాపారావు విశాలాక్ష్మి దంపతులతో పూజలు చేపట్టి భూమిపూజ నిర్వహించారు. గ్రామానికి చెందిన భక్తులు భూమిపూజలో పాల్గొన్నారు.


రావులమ్మ ఆలయ నిర్మాణంలో భాగంగా భూమిపూజలో పాల్గొన్న భక్తులు


మారేడు మొక్కను నాటుతున్న మంత్రి సుభాష్

మనిషి మనుగడకు మొక్కలు పెంచాలి

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మనిషి మనుగడ సాధించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలని మంత్రి సుభాష్ అన్నారు. సోమవారం రామచంద్రపురంలో అగస్త్రేశ్వరస్వామి ఆలయం ఎదురుగా ఉన్న ఉద్యానవనంలో 108 మారేడు మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, అగస్త్రేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ చెరుకుపల్లి గణేష్‌శర్మ, ఎస్‌కెపిపి ట్రస్టు చైర్మన్ సలాది నాయుడు మాస్టారు, కౌన్సిలరు అంకం శ్రీనివాస్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

రావులపాలెం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రావులపాలెం జాతీయ రహదారిపై అక్రమంగా వ్యానులో తరలిస్తున్న 4,600 కిలోల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో పాలకొల్లు నుంచి జొన్నాడ వైపు వెళుతున్న వ్యాన్‌ను ఆపి విజిలెన్స్ అధికారులు తనిఖీలు జరిపారు. వ్యాన్ డ్రైవర్ జక్కంశెట్టి శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా రేషన్ బియ్యం పాలకొల్లు నుంచి తరలిస్తున్నట్లు అధికారులకు తెలిపారు. దీంతో 94 బస్తాల్లో ఉన్న 4600 కిలోల రేషన్ బియ్యాన్ని, వ్యాన్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ చంటి తెలిపారు.

తృటిలో తప్పిన ముప్పు

కొత్తపేట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కొత్తపేట కౌశిక రోడ్డులో విద్యుత్ స్తంభం కింద ఉన్న చెత్తకు నిప్పు అంటుకోవడంతో మంటలు చెలరేగి విద్యుత్ వైర్లు కాలిపోయాయి. స్థానికులు విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో ప్రమాదం తప్పింది. సంఘటనా స్థలానికి ఏఈ శ్రీరామకృష్ణ చేరుకుని ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు మంటలను అదుపు చేయడంతో ఊపిరిపీల్చుకున్నారు.

అన్నదాన పథకానికి విరాళం

ఆత్రేయపురం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): వాడపల్లి ఆలయంలో సోమవారం ఐశ్వర్య లక్ష్మీహోమం, వసంత మండపం లో స్వామివారి కల్యాణం నిర్వహించారు. ఆలయంలో చేపడుతున్న నిత్యాన్నదాన పథకానికి వీరవాసరం మండలం చింతలకోటిగరువుకు చెందిన పి.జయరామ్, లావణ్య దంపతులు రూ.50,116 విరాళం ఇచ్చారు. దాతలకు ఆలయ ఈవో సూర్యచక్రధరరావు స్వామివారి చిత్రపటం అందచేశారు.

కలెక్టర్ నుంచి అవార్డు అందుకున్న కమిషనర్ రంగారావు

మండపేట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): తుఫాన్ సమయంలో మండపేట ప్రజలను అప్రమత్తం చేయడంతోపాటు మున్సిపల్ సిబ్బందిని సమాయత్తం చేసిన మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు, కలెక్టర్ మహేష్ కుమార్ నుంచి మంగళవారం అమలాపురం కలెక్టర్ కార్యాలయంలో అవార్డు, ప్రశంసాపత్రం అందుకున్నారు. తుఫాన్ సమయంలో తనకు సహకరించిన ప్రజలు, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం మండపేటలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్‌తోపాటు జిల్లా జాయింట్ కలెక్టర్ నిషాంతితోపాటు పలు శాఖల అధికారులు వున్నారని కమిషనర్ చెప్పారు.

ఉత్తమ సేవలందించిన అధికారులకు అవార్డులు

కొత్తపేట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): తుఫాన్ సమయంలో సేవలు అందించిన అధికారులకు జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ సోమవారం ఉత్తమ సేవ అవార్డులు అందించారు. కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్, కొత్తపేట తహశీల్దారు వై.రాంబాబు, పి.గన్నవరం సీఐ ఆర్.భీమరాజు, కొత్తపేట ఫైర్ అధికారి టి.శ్రీనివాస్, రావులపాడు వీఆర్వో వి.సూర్యనారాయణ అవార్డులు అందుకున్నారు.

ఆర్డీవోకు అఖిలకు ప్రశంసాపత్రం

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తుఫాను సమయంలో అందించిన సేవలకు రామచంద్రపురం ఆర్డీవో దేవరకొండ అఖిలకు ప్రశంసా పత్రాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్, జేసీ నిషాంతి అందజేశారు. రాయవరం తహసీల్దార్ బీవీ భాస్కర్ కూడా వారి నుంచి ప్రశంసా పత్రం అందుకున్నారు.



విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న మోడరన్ కళాశాల విద్యార్థినులు

సత్తా చాటిన భారత్ మహిళలు

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మహిళా క్రికెట్ కప్‌ను దేశానికి అందించి భారత్ సత్తాను ప్రపంచానికి చాటిచెప్పారని మంత్రి సుభాష్ కొనియాడారు. ఈ సందర్భంగా జట్టు సభ్యులు, బీసీసీఐ బోర్డు సభ్యులకు మంత్రి అభినందనలు తెలిపారు.

విజయోత్సవ ర్యాలీ: వరల్డ్ కప్ ఫైనల్‌లో విజేతగా నిలిచిన భారత మహిళా క్రికెట్ జట్టును అభినందిస్తూ రామచంద్రపురం మోడరన్ కళాశాల విద్యార్థినులు సోమవారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. మోడరన్ విద్యా సంస్థల నుంచి మున్సిపల్ కార్యాలయం మీదుగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మోడరన్ విద్యా సంస్థల అధినేత లయన్ జీవీరావు, ప్రిన్సిపాల్ సీహెచ్ రాజేష్, వైస్ ప్రిన్సిపాల్ పీఎస్ ప్రకాష్, కళాశాల విద్యార్థినులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా బృందానికి జేజేలు

మండపేట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మహిళా క్రికెట్ జట్టు విజయం సాధించటం పట్ల పలువురు నేతలు మహిళల బృందాన్ని అభినందించారు. ఈ సందర్భంగా మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మహిళల విజయంపై హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఏపీఐడీసీ చైర్మన్ జనసేన నేత వేగుళ్ల లీలాకృష్ణ భారత్ మహిళలు ప్రపంచ కప్‌ను కైవసం చేసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్‌నేత హర్షం: భారత్ మహిళా క్రికెట్ బృందం కప్‌ను కైవసం చేసుకోవడం పట్ల కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కామన ప్రభాకరరావు హర్షం వ్యక్తం చేశారు. బీజేపీ నేతలు కోనా సత్యనారాయణ, కె.సాయి తదితరులు ప్రపంచ కప్‌ను మహిళలు కైవసం చేసుకోవటం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

తుఫాను బాధితులకు ప్రభుత్వం అండ

కె.గంగవరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): తుఫాన్ బాధితులకు ప్రభుత్వం అండగా నిలిచిందని రామచంద్రపురం మార్కెట్ కమిటీ డైరెక్టర్ మరివాడ చిన్నికృష్ణ అన్నారు. సోమవారం గ్రామంలో తుఫాను బాధిత కుటుంబాలకు 25 కిలోల బియ్యం, నిత్యావసరాలు, నగదు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఈదల శేషగిరిరావు, ఉప సర్పంచ్ ఈదల శ్రీనివాసరావు, సొసైటీ డైరెక్టర్ నేమాని సత్యనారాయణమూర్తి, బీజేపీ నాయకులు అవసరాల రమణమూర్తి తదిత రులు పాల్గొన్నారు.


అముజూరులో తుఫాను సాయం అందజేస్తున్న కూటమి నాయకులు

అభివృద్ధి పనులకు నేడు ఎమ్మెల్యే భూమిపూజ

రాయవరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పసలపూడి గ్రామంలో మంగళవారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తారని రామచంద్రపురం వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి తెలిపారు. సోమవారం పసలపూడిలో ఆయన మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలకు భూమిపూజ చేస్తారన్నారు.

నవజనార్దనస్వామి ఆలయంలో ఉత్తరాంధ్ర భక్తుల పూజలు

ఆలమూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గోదావరి తీరంలో ఉన్న నవజనార్దనస్వామి ఆలయాలను దర్శించుకునేందుకు ఉత్తరాంధ్ర భక్తులు సోమవారం విచ్చేశారు. ధవలేశ్వరంతోపాటు ఆలమూరు మండలంలోని మడికి, జొన్నాడ, ఆలమూరులోని జనార్దనస్వామి ఆలయాలకు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి ప్రత్యేక వాహనాల్లో వారు వచ్చారు. ఇక్కడ నుంచి మిగిలిన ఆలయాలకు వెళ్లనున్నట్లు వారు తెలిపారు. ఆలమూరు ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ బైరిశెట్టి రాంబాబుతోపాటు సభ్యులు వారికి స్వాగతం పలికారు. ఆలయ ప్రధానార్చకులు అంగర భగవానాచార్యులు పూజలు చేసి వారికి తీర్థ ప్రసాదాలు అందించారు.

స్కౌట్‌పై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలి

రావులపాలెం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): స్కౌట్ అండ్ గైడ్స్ ద్వారా విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ, సేవా భావం పెరుగుతుందని డీఈవో డాక్టర్ షేక్ సలీంబాషా అన్నారు. రావులపాలెం జడ్పీ బాలుర పాఠశాలలో సోమవారం నిర్వహించిన గైడ్స్ కెప్టెన్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని డీఈవో ప్రారంభించారు. అనంతరం ఆయనతో పాటు ట్రైనింగ్ సెంటర్ కోఆర్డినేటర్ రాంబాబు మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ నందం వీరవెంకట సత్యనారాయణ, ఎంఈవోలు ఆర్.నాగరాజు, పి.శ్రీనివాసరాజు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల గైడ్స్ సెక్రటరీలు జె.రాజకుమార్, ఎంవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్ ఏర్పాటుకు స్థలం పరిశీలన

ఆలమూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆలమూరు పోలీస్‌స్టేషన్ వద్ద జొన్నాడ-మండపేట రోడ్డులో పోలీసుల అధ్వర్యంలో నిర్వహించే పెట్రోల్ బంక్ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ఆలమూరు పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న స్థలంలో ఇండియన్ ఆయిల్ కంపెనీ అధ్వర్యంలో బంక్ ఏర్పాటుకు అధికారులు నిర్ణయించడంతో సోమవారం జిల్లా ఏఆర్ డీఎస్పీ సుబ్బరాజు అధ్వర్యంలో ఐవోసీ అధికారులు, రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్, ఆలమూరు ఎస్ఐ జి.నరేష్ స్థలాన్ని పరిశీలించారు.